
ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 18.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 357 పేజీలు: 12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



మొదలైన ఐపీఎల్ సందడి 12









- తెలంగాణలో హింసా రాజకీయాలు ప్రోత్సహించవద్దు
- స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి హింసను ప్రేరేపిస్తున్నారు
- మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వలేదు
- ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం: కేటీఆర్ సవాల్
- రాష్ట్రానికి అప్పుల కుప్పగా మార్చారు..
- అయినా సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నాం
- కేటీఆర్ అందుకు ధన్యవాదాలు తెలపాలి : కోమటిరెడ్డి
- మహిళా సంఘాలకు రూ.57వేల కోట్ల రుణాలిచ్చాం: సీతక్క
- మాటకు కట్టుబడి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్
- కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదు: భట్టి
- బీఆర్ఎస్ హయాంలోనే తన నియోజకవర్గంలో జంట హత్యలు: మంత్రి శ్రీధర్‌బాబు

అసెంబ్లీలో మాటల యుద్ధం

గవర్నర్ ప్రసంగంలో స్పష్టత లేదు

హామీలు అమలు చేయనందుకు ధన్యావాదాలు తెలపాలా?

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 17: అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగింది. మంగళవారం శాసనసభ సమావేశాలు వాడీ, వేడిగా కొనసాగాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల తూటాలు పేలాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మాణంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఒక దశలో గవర్నర్ ప్రసంగానికి ఎందుకు ధన్యవాదాలు తెలుపాలని ఆయన ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి సీతక్క ఒంటికాలుపై లేని కేటీఆర్‌కు గట్టి కౌంటర్‌ఇచ్చారు. ముఖ్యంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదని, ఇస్తే తాను రాజీనామా చేస్తానని కేటీఆర్ ప్రకటించారు. దీంతో మంత్రి సీతక్క లెక్కలతో సహా వివరించి, కేటీఆర్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. స్వయం సహాయక సంఘాలకు

...:: మిగతా 2లో

ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడ?

మహిళలు, రైతులు, వికలాంగులు మోసపోయారు

పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారు



...:: 2లో

- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు క్షీణించింది
- ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు
- గ్లోబల్ సమ్మిట్ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- గవర్నర్ ప్రసంగం విశ్వసనీయత కోల్పోయింది
- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్

కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారు

- బీఆర్ఎస్ నేతలకు ఆడబిడ్డలపై ఏమాత్రం గౌరవం లేదు
- వరి బోనస్ పై రైతులకు 25,000 ఆదా
- మహిళలకు 57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చాం
- మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ముందుకు పోతూనే ఉంటాం
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

...:: 2లో

బీఆర్ఎస్‌కు వారి ఎమ్మెల్యేలపైనే నమ్మకం లేదు

- అందుకే రాజ్యసభ అభ్యర్థిని నిలుపలేదు
- కాంగ్రెస్ ను బలహీన పరిచేందుకు బీఆర్ఎస్ యత్నం
- జీవన్ రెడ్డికి పార్టీ పూర్తి మద్దతుంటుంది
- కేసీఆర్ సభకు రావాలి
- మీడియా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు



రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.32 (బుధవారం సాయంత్రం)

సహర్ – 4.59 (గురువారం ఉదయం)



విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ రద్దు

విపక్షానికి చెందిన 8 మంది సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను లోక్‌సభ మంగళవారం రద్దు చేసింది. బడ్జెట్ సమావేశాల్లో నిరసనల సందర్భంగా అనుచిత ప్రవర్తనకు పాల్పడిన 8 మంది ఎంపీలపై ఫిబ్రవరి 3న స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు.

11



మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ ఏర్పాటు

- సుధీర్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం దర్యాప్తు
- నిందితులను కస్టడీకి కోరుతూ పిటిషన్
- రితేశ్‌రెడ్డి గన్ లైసెన్స్ రద్దు చేయాలని సిఫారసు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 17: మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసును విచారణ చేయడానికి 9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేయనున్నట్లు తెలిపింది. 3 నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలని సిట్‌కు ఆదేశాలు జారీ చేసింది. పైలట్ రోహిత్ రెడ్డి

...:: మిగతా 2లో

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండండి

- పైలట్ రోహిత్‌రెడ్డి వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన బీఆర్ఎస్
- షోకాజ్ నోటీసు జారీ



...:: 3లో

జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్ చేయాలి

- జగ్గారెడ్డి మరో పీజేఆర్ అంతటి వారు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు ఖాయం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 17: ఎప్పుడూ జనంలో ఉండే జగ్గారెడ్డి మాస్ లీడర్.. ఆయనను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జగ్గారెడ్డి మరో పీజేఆర్ అంతటి వారని మెచ్చుకున్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే ఆదుకుంటాడని కితాబిచ్చారు. జగ్గారెడ్డి తెలంగాణ పీసీసీ చీఫ్ అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలవడం ఖాయమని అన్నారు. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. టీపీసీసీ చీఫ్‌గా ఒకసారి ఎన్నికైతే 3 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం మహేశ్ కుమార్ గౌడ్ టీపీసీసీగా వ్యవహరిస్తున్నారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు ...

జగ్గారెడ్డి అసలు పేరు తూర్పు జయప్రకాశ్ రెడ్డి. ఈయన సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2018లో గెలుపొందారు. అంతకు ముందు బీజేపీ

...:: మిగతా 2లో





ఎమ్మెల్యే సంజయ్ వల్లే రాజీనామా

- నన్ను బయటికి పంపేందుకు కుట్ర
- వెనుక ఎవరో ఉండి ప్రోత్సహిస్తున్నారు
- ఆ ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే ఇందుకు పరిష్కారం
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

...:: 2లో



750 ఇళ్లు కూల్చి 410 మందికే న్యాయమా?

- ఇళ్లు కూల్చి ఐదు లక్షలతో సరిపెట్టమంటారా?
- సగం మందికే న్యాయం.. ఇది ప్రజాస్వామ్యమా?
- పేదల తరపున పోరాటానికి సిద్ధం
- వెలుగుమట్ల బాధితులందరికీ న్యాయం చేయాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్
- జస్టిస్ చంద్ర కుమార్ నేతృత్వంలో నిజనిర్ధారణ కమిటీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి, 17: వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అన్యాయమని

...:: మిగతా 3లో



పాక్‌ను జవాబుదారీగా చేయాలి

అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సైనిక స్థావరంగా ఏమాత్రం సమర్థించుకోలేని ఆస్పత్రిపై దాడి చేసి, పెద్ద సంఖ్యలో పౌరుల ప్రాణాలను బలిగొనడం అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య అని మండిపడింది.

11



బిడ్డను దత్తత తీసుకున్న మహిళకూ ప్రసూతి సెలవు

చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనే నిబంధన సరికాదని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

11



...:: 11లో

కాబూల్‌లో ఆస్పత్రిపై క్షిపణి దాడి

- 400 మంది రోగుల మృతి
- మరో 250 మంది రోగులకు గాయాలు
- పాక్ సైనిక దాడిగా అఫ్గాన్ ఆరోపణ
- సైనిక స్థావరాలపైనే దాడి చేశాం : పాకిస్థాన్ ప్రకటన

ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ మృతి.. సుప్రీం లీడర్‌కు గాయాలు



- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ప్రకటన
- శాంతికి ఇది సరైన సమయం కాదు: మొజ్తాబా
- అమెరికా, ఇజ్రాయెల్ ఓటమిని ఒప్పుకోవాలి
- ఖమేనీ క్షేమంగానే ఉన్నారు: ఇరాన్
- యూఏఈ గ్యాస్ క్షేత్రంపై ఇరాన్ దాడి

టెహ్రాన్, మార్చి 17: పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ తమ దాడుల్లో మృతి చెందారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ మంగళవారం వెల్లడించారు. దీంతో ఇరాన్ నాయకత్వంలో మరోసారి సంక్షోభం ఏర్పడింది! ఇప్పటికే అమెరికా, ఇజ్రాయెల్ తో యుద్ధంలో మొదటిరోజే తమ సుప్రీం ఆయతొల్లా ఖమేనిని కోల్పోగా, ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన ఆయన రెండో కుమారుడు మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్నట్టు, మరో అగ్ర కమాండర్ ఘోలమ్రెజా సోలేమాని ఇజ్రాయెల్ సోమవారం రాత్రి జరిపిన వైమానిక దాడుల్లో మరణించారని వార్తలు వచ్చాయి. మరోవైపు యుద్ధం 18వ రోజు కూడా దాడులు, ప్రతిదాడులు

...:: మిగతా 2లో

రాష్ట్రీయం

ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడ?

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: గవర్నర్ ప్రసంగం విశ్వసనీయత కోల్పోయిందని, ఆరు గ్యారెంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీలో తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు గాల్లో కలిసిపోయాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూడా దెబ్బతీశారని ఆరోపించారు. రాష్ట్ర శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగానికి ఉన్న ప్రాధాన్యతను ప్రభుత్వం పూర్తిగా తగ్గించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించిందని, ముఖ్యమంత్రి స్వయంగా ఫైల్‌పై సంతకం చేశారని గుర్తుచేశారు. అయితే ఆ ఫైల్ ఇప్పటివరకు ఎక్కడుందో ప్రభుత్వం చెప్పలేకపోతోందని ప్రశ్నించారు. ప్రజల ముందే సంతకం చేసిన ఆరు గ్యారెంటీల అమలు ఫైల్ మాయమైందని విమర్శిస్తూ, దానిపై ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మొదటి గవర్నర్ ప్రసంగానికే విలువ లేకపోతే, ఇప్పుడు చేసే ప్రసంగాలకు ఏమాత్రం ప్రాధాన్యత ఉంటుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చేసిన సంతకాలు, ప్రకటనలు ప్రజల దృష్టిలో 'జీరో వాల్యూ'గా మారాయని వ్యాఖ్యానించారు. 100 రోజుల్లోనే గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్క కుటుంబానికి కూడా పూర్తి లబ్ధి అందలేదని అన్నారు. ప్రతి కుటుంబానికి రూ.2.5 లక్షల ప్రయోజనం కల్పిస్తామని చెప్పిన హామీ అమలు కాలేదని విమర్శించారు. శాసనసభలో మంత్రులు చెప్పిన మాటలకు విలువ లేకుండా అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించిన కేటీఆర్, కనీసం సభలో అయినా నిజాలు చెప్పాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించడం తమ బాధ్యత అని, కాళోజీ మాటలను ఉటంకిస్తూ ఇది ప్రజల గొడవ అని పేర్కొన్నారు.

మహిళలు, రైతులు, వికలాంగులు మోసపోయారు

ఆరు గ్యారెంటీలతో మహిళలు, రైతులు, వికలాంగులు మోసపోయారని, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాలం మారుతున్నా హామీలు మాత్రం అమలు కావడం లేదని విమర్శించారు. "ఇచ్చింది అభయహస్తం... అమలు మాత్రం భస్మాసుర హస్తం"గా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనను "ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు"గా అభివర్ణించిన కేటీఆర్, 28 నెలల్లో రాష్ట్రానికి మిగిలింది అప్పులు, బకాయిలు, కమిషన్లు, బుల్డోజర్లు మాత్రమేనని అన్నారు. స్కాములు పెరిగి, స్కీములు తగ్గిపోయాయని, రైతులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వరాల్లా ఉన్నాయని, ఎన్నికల తర్వాత అవి "చిత్రగుప్తుడి చిట్టా"గా మారాయని అన్నారు. ఓట్ల ముందు దానకర్ణుల్లా హామీలు ఇచ్చి, ఇప్పుడు కుంభకర్ణుల్లా స్పందించట్లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రపంచ ఎన్నికల చరిత్రలోనే అతిపెద్ద మోసపూరిత పత్రంగా అభివర్ణించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రకటనల కోసం ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారని ఆరోపించిన కేటీఆర్, తెలంగాణ ప్రజల సొమ్ముతో కాంగ్రెస్ ప్రచారం జరుగుతోందని అన్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు క్షీణించింది

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా దిగజారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశంలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు క్షీణించిందని అన్నారు. తలసరి ఆదాయం తగ్గిందని, రిజిస్ట్రేషన్లు, జీఎస్టీ ఆదాయం తగ్గాయని చెప్పారు. కరోనా కాలం తర్వాత ఇంత దారుణ పరిస్థితి ఇప్పుడు మాత్రమే కనిపిస్తోందని విమర్శించారు. "ఉస్సేన్ బోల్ట్ లా పరిగెత్తిన ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఎందుకు చతికిలపడింది?" అని ప్రశ్నించారు. నెగటివ్ పాలసీలు, నెగటివ్ ప్రచారం వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ఆరోపించారు. గ్లోబల్ సమిట్ పేరుతో పెట్టుబడులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. పెట్టుబడులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ విషయంలో కూడా కాంగ్రెస్ మాట తప్పిందని, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పారిశ్రామికవేత్తల్లో ప్రభుత్వంపై నమ్మకం తగ్గుతోందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆదాయం గణనీయంగా పడిపోయిందని, అంచనాలు కూడా చేరలేకపోతున్నాయని వివరించారు. గతంలో వేగంగా పెరిగిన ఆదాయం ఇప్పుడు క్షీణించిందని అన్నారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వసనీయత కోల్పోయిందని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫ్యూచర్ సిటీకి అసలు ఫ్యూచర్ ఉందా ?

తెలంగాణలో ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు భవిష్యత్తుపై బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ కీలక ప్రశ్నలు లేవనెత్తారు. గ్లోబల్ సమ్మిట్లలో ప్రకటించిన పెట్టుబడులు, అవగాహన ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రి శ్రీధర్ బాబును ఆయన కోరారు. టీఎస్ఐపాస్ వెబ్‌సైట్ గత పదేళ్లలో అత్యంత పేలవమైన పనితీరును చూపుతోందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 14,000 ఎకరాలలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని, ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ వంటి పేర్లతో మళ్లిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఫార్మా కోసం షరతులతో కూడిన ఈ భూమిని ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్లాట్లు ఇవ్వడానికి, స్టేడియాలు, జూ పార్కులు నిర్మించడానికి ఉపయోగించలేరని ఆయన స్పష్టం చేశారు. ఫార్మా సిటీ రద్దు కాలేదని కోర్టుకు చెబుతూ, బయట మాత్రం దానిని ఫ్యూచర్ సిటీగా ప్రచారం చేయడంలో వైరుధ్యం ఉందని కేటీఆర్ అన్నారు. కాలుష్య కారక పరిశ్రమల మధ్యలో నివాస సముదాయాలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పారిశ్రామికవేత్తలకు నమ్మకం ఎలా కుదురుతుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌కు వారి ఎమ్మెల్యేలపైనే నమ్మకం లేదు

- అందుకే రాజ్యసభ అభ్యర్థిని నిలుపలేదు : మీడియా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: ప్రస్తుత రాజకీయ పరిణామాలపై మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిసమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపరచడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. జీవన్ రెడ్డి విషయంపై స్పందిస్తూ.. ఆయన ఎలాంటి పదవులు కోరుకోలేదని, స్థానిక సమస్యలే ఉన్నాయని తెలిపారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

కేసీఆర్‌బాధ్యతగా శాసనసభకు హాజరవ్వాలి..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనుభవజ్ఞుడని, బాధ్యతగా శాసనసభకు హాజరవ్వాలని శ్రీధర్ బాబు సూచించారు. నామినేటెడ్ పదవుల విషయంలో హైకమాండ్ కసరత్తు చేస్తోందని, పోర్ట్‌ఫోలియో కేటాయింపులు ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. భవిష్యత్తులో సీఎం ఎవరనే అంశాన్ని ఏఐసీసీ నిర్ణయిస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.15 వేల కోట్ల బకాయిలను గత ప్రభుత్వం వదిలేసిందని ఆరోపించారు. అయితే.. వాటిని ప్రస్తుత ప్రభుత్వం చేసిన బకాయిలుగా చూపుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీ ఫ్లోర్ కమిటీలు త్వరలోనే భర్తీ అవుతాయని తెలిపారు.

నమ్మకం లేకనే అభ్యర్థిని పెట్టలేదు..

అనిరుధ్ రెడ్డి ప్రతిపాదించిన ఇప్పపువ్వు సారా అంశంపై స్పందిస్తూ.. అది మంచి ఆలోచనగా అభివర్ణించారు శ్రీధర్ బాబు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో పనిచేస్తూ సిక్సర్లు కొడుతుంటే, బీఆర్ఎస్ సోషల్ మీడియాలో మాత్రమే ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ అసెంబ్లీ బయటే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఎవరూ ఏ వర్గాన్ని అవమానించేలా మాట్లాడకూడదని సూచిస్తూ.. ఇప్పటికే మందుల సామేలు వివరణ ఇచ్చారని, అవసరమైతే మళ్లీ వివరణ ఇస్తారని చెప్పారు. బీఆర్ఎస్ తమ ఎమ్మెల్యేలపై నమ్మకం లేకనే రాజ్యసభ అభ్యర్థిని నియమించలేదని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు.

జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్ చేయాలి

మొదటిపేజీ తరువాయి

తరపున మున్సిపల్ ఛైర్మన్‌గా రాజకీయం జీవితం ప్రారంభించి, తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి 2004లో, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో(2009) కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2023లో జరిగిన ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి బరిలో దిగి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ చేతిలో ఓటమిపాలయ్యారు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ జగ్గారెడ్డి భార్య నిర్మల జగ్గారెడ్డికి టీజీఐఐసీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవిని ఇచ్చింది. ప్రస్తుతం ఆమె ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆయన ఒకవేళ ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా మంత్రి అయ్యేవారని విశ్లేషకులు గుర్తుచేస్తుంటారు. జగ్గారెడ్డి ఫిబ్రవరి నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజు హల్‌చల్ చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

జగిత్యాల కాంగ్రెస్లో మంటలు

మరోవైపు తాను పార్టీ మారాలని ఆలోచించేందుకు పూర్తి కారణం ప్రస్తుత జగిత్యాల ఎమ్మెల్యే సంజయేనని కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మీడియాముఖంగా స్పష్టం చేశారు. ఎంత ఇబ్బంది ఉంటే పార్టీ మారాలని ఆలోచిస్తున్నానో అర్థం చేసుకోవాలని పార్టీ నాయకత్వానికి సూచించారు. కాంగ్రెస్‌తో తనది 40 ఏళ్ల బంధమని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తాను ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నానని చెప్పారు. 2014లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తనకు ప్రజలు అవకాశం ఇచ్చారన్న జీవన్ రెడ్డి ప్రస్తుత శాసన సభ్యుడు సంజయ్ ఇక్కడి ప్రజల అభివృద్ధి హక్కును సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ వక్రమార్గాన పోతే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో హర్షించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని వదిలితే ఫ్లెక్సీలు ఏంటని, పూర్తిగా అన్నీ మారతాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆఫీసు నుంచి కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించడంపై ఈ కామెంట్స్ చేశారు. ఒకసారి కాంగ్రెస్ పార్టీని వీడితే తదుపరి ఏ పార్టీలో చేరాలో ఆలోచిస్తానని ఆయన వివరించారు. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో సంజయ్ చేరడాన్ని మొదటి నుంచి జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్లు పలు రకాల ఆరోపణలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ పదవిని కూడా తన వర్గానికి ఇవ్వకుండా చేశారని బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో మాటల యుద్ధం

మొదటిపేజీ తరువాయి

రూ.57 వేల కోట్ల రుణాలిస్తే రాజీనామా చేస్తానన్న కేటీఆర్.. ఇప్పుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. కేటీఆర్ అసెంబ్లీలో చెప్పిన తన మాటకు కట్టుబడి ఉండాలని సీతక్క గుర్తు చేశారు. బ్యాంకుల ద్వారా ఈ రెండు సంవత్సరాలల్లో మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల రుణాలు ఇచ్చామని, మహిళా సంఘాల రుణాలపై వడ్డీ భారాన్ని కూడా భరిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల రుణాలపై ఇప్పటివరకు రూ.1,390 కోట్ల వడ్డీ చెల్లించామన్న మంత్రి బీఆర్ఎస్ హయాంలో వడ్డీలు ఎగ్గొట్టారని, అభయహస్తం నిధులు కాజేశారని ఆరోపించారు. ఆధారాలు బయటపెట్టానని, లెక్కలు సరిచూసుకో అంటూ కేటీఆర్ ఉద్దేశించి, అసెంబ్లీ లాబీలో మంత్రి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

కేటీఆర్‌కు భట్టి, సీతక్క కౌంటర్

మంగళవారం సభలో మహిళలకు వడ్డీలేని రుణాలపై మాటకు మాట చోటుచేసుకుంది. వడ్డీ లేని రుణాలపై గవర్నర్ ప్రసంగంలో స్పష్టత లేదని కేటీఆర్ ఆరోపించారు. మహిళలకు 57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చామని భట్టి విక్రమార్క తెలిపారు. దీనిపై స్పందించిన కేటీఆర్ రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని భట్టి విక్రమార్క, సీతక్క సమాధానం ఇచ్చారు. మహిళా సంక్షేమం గురించి కేటీఆర్ సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. "కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోంది. పదేళ్ల పాలనలో మహిళల కోసం బీఆర్ఎస్ ఏం చేసింది. రూ. 3 వేల కోట్ల వడ్డీలను మహిళలపై భారం మోపింది. ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసి ఆదా చేసుకున్న అభయహస్తం నిధులను గత ప్రభుత్వం కాజేసింది" అని సీతక్క ధ్వజమెత్తారు.

కేటీఆర్– మంత్రి కోమటిరెడ్డి

శాసనసభలో కేటీఆర్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య మాటల సంవాదం చోటుచేసుకుంది. హామీలు అమలు చేయనందుకు ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలపాలా? అని కేటీఆర్ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కోమటిరెడ్డి రాష్ట్రానికి అప్పుల కుప్పగా మార్చినప్పటికీ పేదవారి సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నందుకు ధన్యావాదాలు తెలపాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని కోమటిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. అప్పులబారిన పడిన రాష్ట్రాన్ని క్రమంగా గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నామన్నారు. రెండున్నరేళ్లలో 3.25 లక్షల కోట్ల బకాయిలు చెల్లించామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోమటిరెడ్డి అన్నారు. "బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కాంగ్రెస్ వచ్చాక తెల్లరేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం ఇస్తోంది. రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి రూ.11 వేల కోట్లు చెల్లించాం. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నందుకు ధన్యావాదాలు చెప్పాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన మంచి కార్యక్రమాలు ఒక్కటైనా చెప్పాలి. అప్పులబారిన పడిన రాష్ట్రాన్ని క్రమంగా గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నాం. రెండున్నరేళ్లలో రూ.3.25 లక్షల కోట్ల బకాయిలు చెల్లించాం. గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు చెప్పాలి. ప్రజలను మోసగించినందుకు క్షమాపణలు చెప్పాలి"అని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు.

కేటీఆర్– మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణలో ఇంతకాలం హింసా రాజకీయాలు లేవని కాంగ్రెస్ వాటిని ప్రోత్సహించవద్దని కేటీఆర్ కోరారు. స్వయాన సీఎం రేవంత్‌రెడ్డి హింసను ప్రేరేపిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే తన నియోజకవర్గంలో జంట హత్యలు జరిగాయని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గులాబీ నాయకులు ఇష్టానుసారంగా పోలీసులను దూషిస్తున్నారని మండిపడ్డారు.

కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారు

- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: రైతు భరోసా కాకుండా ఒక్కో రైతుకు వరి ధాన్యం బోనస్ పేరిట రూ. 25000 ఆదా అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతుల శ్రమను గుర్తించి సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రైతుల ఖాతాలో వేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9,000 కోట్లు కేవలం తొమ్మిది రోజుల్లో వారి ఖాతాలో జమ చేశారు అన్నారు. వడ్డీ లేని రుణాల కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు సంవత్సరానికి 20వేల కోట్ల పైగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు ఇప్పటివరకు వడ్డీ లేని రుణాల కింద 57 వేల కోట్లను మహిళల ఖాతాలో జమ చేశామని తెలిపారు. మహిళలు బాగుపడితే కుటుంబం మొత్తం బాగుపడుతుంది తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వివరించారు. టిఆర్ఎస్ నేతలకు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. ప్రతి సందర్భంలో కేటీఆర్ మహిళల మనసు గాయపరుస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మహిళల గురించి జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలి అన్నారు. కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారు అనిపిస్తుంది, మహిళల అభివృద్ధి గురించి వారికి శ్రద్ధ ఉంటే వారి క్యాబినెట్లో మహిళలకు అవకాశం కల్పించేవారు అని అన్నారు. కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు వడ్డీ లేని రుణాలు చెక్కులు చెల్లించుకుంటూ పోతున్నాం, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎన్ని అడ్డంకులు సృష్టించిన ముందుకు పోతూనే ఉంటాం అన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళలను మహారాణులుగా గౌరవిస్తుంది వారు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేసేందుకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఎక్కడ ఆలస్యం అవుతుందో అని ప్రమాణ స్వీకారం చేసిన గంటలోపే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాం అని తెలిపారు. ఆడబిడ్డల పక్షాన బస్సు చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి క్రమం తప్పకుండా ప్రతినెలా చెల్లిస్తుందని వివరించారు. అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటాడు, మేకలను ఎక్కడ కట్టివేయాలి అని మేము డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని పదేళ్లపాటు మాటలు చెప్పారు, బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మి ప్రజలు చూసి చూసి కళ్లు కాయలు కాసేయ్. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మాత్రం రాలేదు అన్నారు. కానీ మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో ఇంటికి 5 లక్షల చొప్పున మంజూరు చేసి నిండు నిర్మాణం ప్రారంభించాం. మొదటి దశలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఒకేసారి 22,500 కోట్లు మంజూరు చేశాం దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజా ప్రభుత్వం అమలు చేసుకుంటూ ముందుకు పోతుందని తెలిపారు. కానీ టిఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఇంటికో ఉద్యోగం, దళిత సీఎం, భూమిలేని పేదలకు వ్యవసాయ భూమి పంపిణీ హామీల్లో ఏ ఒక్కటి పది సంవత్సరాల కాలంలో నెరవేర్చలేదు

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

సోదరుడు రితేశ్‌రెడ్డి గన్ లైసెన్స్ రద్దు చేయాలని సిట్ సిఫారసు చేసింది. ఫామ్‌హౌస్‌లో సోదాలకు వెళ్లిన పోలీసులపై రియల్టర్ నమిత్ శర్మ, రితేశ్ రెడ్డి లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో కాల్పులు జరిపాడు. తుపాకీ లైసెన్స్ దుర్వినియోగం చేశారని సిట్ అధికారులు సీపీకి లేఖ రాశారు. మరోవైపు ముగ్గురు నిందితులను 7 రోజులు కస్టడీకి కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ఫాంహౌస్‌లో ఈ నెల 14న (శనివారం) రాత్రి జరిగిన విందుపై తెలంగాణ ఈగల్, మొయినాబాద్ పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఈ డ్రగ్స్, మద్యం పార్టీకి ప్రధాన సూత్రధారిగా తేలింది. కొన్నిరోజులుగా రోహిత్‌రెడ్డి తన ఫాంహౌస్‌లో వారాంతపు పార్టీ చేద్దామనే గట్టి ఆలోచనలో ఉన్నాడు. ఈ క్రమంలో ఆయన స్నేహితుడు, బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్ రవి బిజినెస్ మీటింగ్‌లో భాగంగా శిమ్లా వెళ్లినప్పుడు ఓ వ్యక్తి దగ్గర రూ.15 వేలకు కొకైన్‌ను కొనుగోలు చేశాడు. పార్టీలో మొత్తం 11 మంది : ఈ విషయం పైలట్ రోహిత్ రెడ్డితో చెప్పగా ఈ నెల 14న సాయంత్రం తన ఫాంహౌస్‌లో పార్టీ చేద్దామనే ఆలోచనకు వచ్చి నిర్ణయించుకున్నాడు. దీనికి తన స్నేహితుడు ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌తో సహా ఇతరుల్ని ఆహ్వానించాడు. కౌశిక్ రవి డ్రగ్స్‌తో నేరుగా ఫాంహౌస్‌లో జరిగే పార్టీకి వచ్చాడు. మొత్తం 11 మంది పాల్గొన్న పార్టీలో మహేశ్ కుమార్, రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి, నమిత్ శర్మ తదితరులంతా మద్యంలో కొకైన్(డ్రగ్స్) కలిపి సేవించారు.

గన్‌తో నమిత్‌శర్మ కాల్పులు

ఈ ఫాంహౌస్‌లో మద్యం, డ్రగ్స్ పార్టీ కేసులో ఒక్కొక్కటిగా సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఫాంహౌస్‌లోకి పోలీసులు రావడాన్ని చూసిన నమిత్‌శర్మ తప్పించుకొని పారిపోవాలనే ఉద్దేశంతోనే గన్‌తో కాల్పులు జరిపినట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు ఫాంహౌస్‌లోకి ప్రవేశించే సమయంలోనే తుపాకీ కాల్పుల శబ్దం వినిపించింది. దీంతో తాము ఫ్యూచర్‌సిటీ పోలీసులమని, పక్కా సమాచారంతో సోదాలకు వచ్చామంటూ వారు గట్టిగా చెప్పారు. దీన్ని లెక్క చేయకుండా నమిత్ పోలీసు అధికారిని టార్గెట్‌గా చేసుకుని ఒక రౌండు కాల్పులు జరిపాడు. పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్ రెడ్డి ఇద్దరూ వాళ్లను కాల్చేయ్, తర్వాత మొత్తం మేం చూసుకుంటాం అంటూ నమిత్ శర్మను రెచ్చగొట్టినట్లు సమాచారాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులు అప్రమత్తతతో అందర్నీ చుట్టుముట్టడంతో తుపాకీ కాల్పులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలోనే పైలట్ రోహిత్‌రెడ్డి, నమిత్ శర్మ, రితేశ్ రెడ్డిపై కొత్తగా అటెంప్ట్ టు మర్డర్ సెక్షన్లను జోడించారు. ప్రస్తుతం ఈ ముగ్గురు నిందితులు చంచల్‌గూడ జైలు రిమాండ్‌లో ఉన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ వల్లే రాజీనామా

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం ప్రతినిధి, జగిత్యాల, మార్చి 17: ఎమ్మెల్యే సంజయ్ వల్లే తాను రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను పార్టీ నుంచి బయటికి పంపించేందుకు కుట్ర జరుగుతుందని, సంజయ్ వెనుక ఎవరో ఉండి ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తాను ఇంకా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్టు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతో తనకు 40 యేళ్ల బంధం ఉందని, ఎంత ఇబ్బంది పెట్టి ఉంటే పార్టీ మార్పుపై ఆలోచిస్తున్నానొ అర్థం చేసుకోవాలని జీవన్ రెడ్డి చెప్పారు. అసలు సంజయ్ ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారని, తనను ఎలా కలిసి రమ్మంటారని మండిపడ్డారు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని తాను అనుకోవడం లేదని, తనకు కార్యకర్తల అభిప్రాయం ముఖ్యమని అన్నారు. ఈ వ్యవహారానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కూడా బాధ్యత వహించాలని అన్నారు. తాను పార్టీ వీడడానికి సంజయ్ వ్యవహారం ఒక్కటే కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల అమలులో జాప్యం చేస్తోందని, ప్రజల్లో పార్టీ పై అసంతృప్తి ఉందని అన్నారు. తాను ఒక్కడిని పార్టీ వీడిదే ఈ సమస్య పరిష్కారం కాదని, కాంగ్రెస్ లోకి వచ్చిన ఆ పది మంది ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే ఇందుకు పరిష్కారం అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ మృతి.. సుప్రీం లీడర్‌కు గాయాలు

మొదటిపేజీ తరువాయి

ఆగ లేదు. తాజాగా మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షా గ్యాస్ క్షేత్రం లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. లారీజానీ మృతిపై ఇరాన్ స్పందించనప్పటికీ, మార్చి 4న యూఎస్ దాడిలో మరణించిన ఇరాన్ నావికులను స్మరిస్తూ లారీజానీ తన చేతిరాతతో రాసిన ఒక నోట్‌ను ఎక్స్‌లో ఉంచినప్పుడు ఇజ్రాయెల్ ఆయన మరణ ప్రకటన చేసింది. 67 ఏండ్ల లారిజానీ ప్రస్తుతం ఇరాన్‌లో మొజ్తాబా తర్వాతి పదవిలో(స్థానంలో) ఉన్నారు. పరివర్తన కౌన్సిల్‌లో కలిసి ఆయన దేశంలోని పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం రష్యాలో చికిత్స పొందుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. యూఎస్ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఆయన తీవ్రంగా గాయపడ్డారని, దీంతో ఆయనను రష్యాకు తరలించి చికిత్స అందజేస్తున్నారని తెలిసింది.

ఖమేనీ క్షేమంగానే ఉన్నారు: ఇరాన్

రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియన్‌కు ఫోన్ చేసి ఖమేనీకి తమ దేశంలో చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారని కువైట్ వార్తాపత్రిక అల్‌జరీదా వెల్లడించింది. పుతిన్ నుంచి ఫోన్‌కాల్ వచ్చిన తర్వాత ఖమేనీని మిలిటరీ విమానంలో గురువారం రష్యాకు తరలించారని ఆ వార్తా కథనం పేర్కొంది. అయితే ఈ వార్తను రష్యా నిర్ధారించడం కానీ, తిరస్కరించడం కానీ చేయలేదు. అలాంటి వార్తా కథనాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. అయితే యూఎస్ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ గాయపడినప్పటికీ క్షేమంగానే ఉన్నారని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అతని చేయి, కాలిపై గాయాలైనట్టు వెల్లడించింది. కాగా, తమ దాడిలో మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడి వికృతంగా మారిపోయాడని అమెరికా ఒక ప్రకటనలో తెలిపింది.

అమెరికా, ఇజ్రాయెల్ ఓటమిని అంగీకరించాలి

ఉద్రిక్తతలు తగ్గించడానికి లేదా అమెరికాతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడానికి రెండు దేశాలు చేసిన రాజీ ప్రతిపాదనలను ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా మొజ్తాబా ఖమేనీ తిరస్కరించినట్లు ఇరాన్ అధికారిని ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ మంగళవారం వెల్లడించింది.

యూఏఈ గ్యాస్ క్షేత్రంపై ఇరాన్ దాడి

యుద్ధం 18వ రోజుకు చేరుకున్నప్పటికీ పశ్చిమాసియాలో దాడులు, ప్రతిదాడులు ఆగడం లేదు. తాజాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షా గ్యాస్ క్షేత్రం లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. దీంతో అక్కడ పెద్దయెత్తున మంటలు చెలరేగడంతో కార్యకలాపాలను ఆపేశారు. విపత్తు నివారణ బృందాలు రంగంలోకి దిగి అతి కష్టం మీద మంటలను అదుపులోకి తెచ్చారు..



ఇరాన్‌పై దాడి చేయకపోయి ఉంటే వారు అణుబాంబును తయారు చేసుకునేవారు. అదే జరిగితే 24 గంటల్లోనే దాన్ని ప్రయోగించి ఉండేవారు. ఇది కేవలం పశ్చిమాసియాలోనే గాక యూరప్ వరకు పాకి ఉండేది. అమెరికా నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ డైరెక్టర్ జో కెంట్ భద్రతాపరమైన విషయంలో చాలా వీక్. ఆయన వెళ్లిపోవడమే మంచిదైంది.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయానికి బాటలు

- **ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని రైతులకు పిలుపు**
- **ఈ నెల 20 నుండి 22 వరకు ఘనంగా 'రైతు మహోత్సవం'**
- **61 వేల మంది రైతులకు 'ఫార్మర్ కిట్ల' పంపిణీ ప్రారంభం**
- **కార్యక్రమాన్ని ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మంగళవారం సచివాలయ ప్రాంగణం నుండి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ ఎపిసోడ్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రంగరెడ్డి జిల్లాకు చెందిన రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్లను' అందజేసి రాష్ట్రవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు వాతావరణం కలుషితమవుతున్న తరుణంలో, మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులే రైతులకు, సమాజానికి క్షేమకరమని ఆయన నొక్కి చెప్పారు.

రైతు మహోత్సవానికి తరలిరండి

మార్చి 20, 21, 22 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న 'రైతు మహోత్సవ' కార్యక్రమానికి రైతులు భారీగా తరలి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. 150కి పైగా స్టాల్స్, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ చివరి రోజున ముఖ్యమంత్రి చేతుల మీదుగా యాసంగి సీజన్ రైతు భరోసా నిధుల జమ కార్యక్రమం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ అధిక ఆదాయాన్ని గడించాలని మంత్రి ఆకాంక్షించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమంలో లక్ష్యానికి మించి 110% నమోదు చేసి దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలచి కేంద్ర ప్రభుత్వం ద్వారా 422.64 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకం పొందడంలో కీలక పాత్ర పోషించిన వ్యవసాయ విస్తరణ అధికారులు మండల వ్యవసాయ అధికారులు సహాయ సంచాలకులు జిల్లా వ్యవసాయ అధికారులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి కె.సురేంద్రమోహన్, వ్యవసాయ సంచాలకులు బి. గోపి పాల్గొన్నారు

61,125 మంది రైతులకు కిట్ల పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, ఒక్కో క్లస్టర్ నుండి 125 మంది చొప్పున మొత్తం 61,125 మంది రైతులను ఈ పథకం కోసం ఎంపిక చేశారు. వీరికి అవగాహన తో పాటుగా ఫార్మర్ కిట్లను అందజేశారు. ఈ కిట్‌లో ప్రకృతి వ్యవసాయంపై "క్షేత్ర దర్శిని" పుస్తకం, క్లాత్ బ్యాగ్, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ మరియు చిన్న డైరీ ఉన్నాయి.

ఆర్థిక, సామాజిక వృద్ధికి చలనశీలత కీలకం

- **రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **నేషనల్ మొబిలిటీ సమ్మిట్ 2026 ప్రారంభం**



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: హెచ్ఐసీసీ నోవాటెల్లో సెకండ్ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ 2026 కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ 2026 లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. జాతీయ మొబిలిటీ సమ్మిట్‌ను నిర్వహించినందుకు రవాణా శాఖ, ఎలెట్స్ టెక్నోమీడియాను మంత్రి అభినందించారు. ఆర్థిక వృద్ధి మరియు సామాజిక అభివృద్ధికి చలనశీలత కీలకమైనదని అన్నారు. సమర్థవంతమైన రవాణా వ్యవస్థలు పౌరులు ఉద్యోగాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార అవకాశాలను పొందడంలో సహాయపడతాయని అన్నారు. నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పుడు, సురక్షితమైన, సరసమైన , స్థిరమైన చలనశీలత వ్యవస్థలను నిర్మించడం ముఖ్యమైనదని మంత్రి పేర్కొన్నారు. స్థిరమైన చలనశీలత పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ ,కమిషనర్ ఇలాంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,భాగ్యనగర్ గ్యాస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రాజు , మధు, రామకృష్ణ,సూరజ్ , ఎలెట్స్ టెక్నోమీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండండి

- **పైలట్ రోహిత్‌రెడ్డి వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన బీఆర్ఎస్**
- **షోకాజ్ నోటీసు జారీ చేసిన భారత రాష్ట్ర సమితి**
- **వారం రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశాలు**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 17 : మాదక ద్రవ్యాల వినియోగం ఆరోపణల నేపథ్యంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిపై భారత రాష్ట్ర సమితి చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన పార్టీ అధిష్ఠానం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ క్రమశిక్షణా వ్యవహారాల బాధ్యులు సోమా భరత్ కుమార్ ఈ మేరకు నోటీసు ఇచ్చారు. ఈ అంశం విస్తృతంగా మీడియాలో ప్రచారం పొందడం వల్ల పార్టీ ప్రతిష్ఠకు, ప్రజల్లో ఆందోళనకు దారితీసిందని నోటీసులో పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలను పాటించడంలో కట్టుబడి ఉందని తెలిపారు. అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా మాదక ద్రవ్యాల వినియోగం లేదా వాటితో ఏ విధమైన సంబంధం కలిగి ఉండటాన్ని పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రోహిత్ రెడ్డి ప్రమేయంపై వచ్చిన ఆరోపణలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉండటంతో ఈ విషయాన్ని పార్టీ అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజుల్లోపు స్పష్టమైన, సమగ్ర లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని రోహిత్ రెడ్డిని ఆదేశించారు.

నోటీసు లేకుండానే తగిన క్రమశిక్షణా చర్యలు

ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలు, అధికారిక కార్యకలాపాల్లో రోహిత్‌రెడ్డి పాల్గొనకుండా ఉండాలని కూడా ఆదేశాలు ఇచ్చామని భరత్ కుమార్ పేర్కొన్నారు. నోటీసుకు గడువులోగా సంతృప్తికరమైన వివరణ సమర్పించకపోతే పార్టీ రాజ్యాంగం, నియమావళి ప్రకారం ఎటువంటి అదనపు నోటీసు లేకుండానే తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

సిట్ విచారణ చేసే అవకాశం..

రోహిత్ రెడ్డి పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు? డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా చేశారు? డ్రగ్స్‌తో పాటు అసలు ఫాంహౌస్‌లో ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి? గతంలో ఎవరైనా ప్రముఖులు ఇక్కడికి వచ్చారా?



వస్తే వారికి ఎలాంటి పార్టీ ఇచ్చారు? ఇదే తరహాలో ఎన్ని పార్టీలు జరిగాయి? అన్న కోణంలో సిట్ విచారణ చేసే అవకాశం ఉంది. డ్రగ్స్ దందాతో పాటు దుబాయ్‌కు ఉన్న సంబంధాలపై సిట్ ఆరా తీయనుంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాతో నిందితులకు ఏమైనా పరిచయాలు ఉన్నాయా? అన్న లింకులపైనా సిట్ బృందం ఫోకస్ చేయనుంది. సిట్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో ఈ కేసులో మరికొంతమంది రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందా? అన్న ఉత్కంఠ నెలకొంది.

750 ఇళ్లు కూల్చి 410 మందికే న్యాయమా?

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. 750 కుటుంబాల్లో కేవలం 410 మందికే సహాయం ప్రకటించడం అన్యాయమని, బాధితులందరికీ పూర్తి న్యాయం జరిగే వరకు కమిటీతో కలిసి పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నోటీసులు లేకుండా ఇళ్లు కూల్చడం చట్టవ్యతిరేకం అని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో జరిగిన ఇళ్ల కూల్చివేతపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ తదితరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల సమస్యలను వెలికితీసేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి రిటైర్డ్ జడ్జీలు, ఆర్మీ అధికారులు, మేధావులతో కూడిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. వెలుగుమట్ల ఘటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కవిత విమర్శించారు. 750 ఇళ్లను కూల్చి కేవలం 410 మందికే సహాయం ప్రకటించడం తీవ్ర అన్యాయమని పేర్కొంటూ, బాధితులందరికీ న్యాయం జరిగే వరకు కమిటీ ద్వారా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడారు. రిటైర్డ్ జడ్జీలు, మాజీ ఆర్మీ అధికారులు, ప్రొఫెసర్లు, లాయర్లు, జర్నలిస్టులు, సామాజికవేత్తలతో కూడిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ప్రభుత్వం ఎటువంటి ముందస్తు నోటీసులు, హెచ్చరికలు ఇవ్వకుండా సుమారు 750 మంది పేదల ఇళ్లను కూల్చివేయడం చాలా దారుణమని విమర్శించారు. ఈ అన్యాయంపై జాగృతి సంస్థ, ధర్మ సమాజ్ పార్టీ చేపట్టిన ప్రజా పోరాటం కారణంగానే ప్రభుత్వం దిగివచ్చిందని, దాని ఫలితంగా కొంతమందికి న్యాయం చేస్తామని ప్రకటించిందని చెప్పారు. అయితే మొత్తం 750 మంది బాధితుల్లో కేవలం 410 మందికే ఇళ్లు లేదా సహాయం అందిస్తామని చెప్పడం పూర్తిగా అన్యాయమని కవిత అన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగేలా రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ ఆధ్వర్యంలో ఒక ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ఆర్మీ మేజర్ (రిటైర్డ్) మదన్ కుమార్, ప్రొఫెసర్లు అనురాధ, నాగం కుమారస్వామి, రామయ్య, లాయర్లు సుంకర నరేష్, శ్రావణ్ గౌడ్, నూర్జన్, జర్నలిస్టులు తెలంగాణ విఠల్, ఆకాశ్ గౌడ్, క్రాంతి తదితరులు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. వీరు తమ తమ ఉద్యోగాలు చేస్తూనే సమాజం కోసం నిస్వార్థంగా ముందుకు వచ్చారని, వారి కట్టుబాటును ప్రశంసిస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ త్వరలో ఖమ్మం వెళ్లి బాధితులను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటుందని, అధికారులతో కూడా చర్చించి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేస్తుందని చెప్పారు. అనంతరం ప్రజాస్వామ్య పద్ధతిలో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వం ముందు ఉంచుతుందని తెలిపారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ కమిటీ ప్రభుత్వం వెంట పడుతుందని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఆర్మీ మేజర్ మదన్ కుమార్ మాట్లాడుతూ వెలుగుమట్ల ఘటనపై జాతీయ మీడియాలో సరైన స్థాయిలో చర్చ జరగలేదని అన్నారు. బాధితులతో మాట్లాడి వారి అవసరాలను అర్థం చేసుకొని ఎంత పరిహారం ఇస్తే న్యాయం జరుగుతుందో నిర్ణయిస్తామని చెప్పారు. భూదాన్ భూములు పేదలకు ఇవ్వాల్సినవని, అవి ప్రభుత్వ భూములు కావని పేర్కొన్నారు. గల్వాన్ ఘటనను ప్రస్తావిస్తూ దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన సైనికుల కుటుంబాలకు రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలని ముందుగా కవితే డిమాండ్ చేశారని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయని గుర్తుచేశారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మేధావులు, యువత, విద్యార్థులు నిర్లిప్తంగా ఉంటే సమాజంలో సమస్యలు అలాగే కొనసాగుతాయని హెచ్చరించారు. బంగ్లాదేశ్, శ్రీలంక వంటి ప్రాంతాల్లో మేధావుల సహకారంతో యువత పోరాటం చేయడంతో ప్రభుత్వాలు మారిన ఉదాహరణలను ప్రస్తావించారు. ప్రభుత్వాలు తమ వద్ద అధికారముందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజా పోరాటాలు తప్పవని అన్నారు. వెలుగుమట్లలో బాధితుల పిల్లల చదువు, కుటుంబాల పరిస్థితి వంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- **ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్తంగా బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడేషన్ కార్డుల జారీలో కానీ అక్కడేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

- **యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు**
- **విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ**
- **టి-సాట్ లైవ్ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 17 : తెలంగాణ యువత కోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతికతకు అనుసంధానం చేస్తూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 'యూజీ అండ్ పీజీ కోర్సెస్ న్యూ అండ్ ఎమెర్జింగ్ ఏరియాస్' అనే అంశంపై మంగళవారం టిసాట్ వేదికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తాము ప్రతిపాదించే కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు తమ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కలలను నిజం చేసేందుకు తెలంగాణలోని అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం సుమారు 39 కోర్సులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి విజన్‌లో భాగమైన 2047 లక్ష్యాన్ని పూర్తి చేసే ప్రయత్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను రూపొందించామన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 19 కోర్సులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం మరో 10 కోర్సులను తక్షణమే ఉపాధి కల్పించేవిగా ఆచరణలోకి తేబోతున్నామని, ఏఈడీపీ(అప్రెంటీస్ ఎనేబుల్డ్ డిగ్రీ ప్రోగ్రామ్స్)లో భాగంగా మరో 10 కోర్సులు ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు. 2030 సంవత్సరానికీ మూడు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి పబ్లిక్ అండ్ ప్రయివేటు భాగస్వామ్యంతో తెలంగాణాలోని వివిధ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ ఉద్యోగాలను సాధించేందుకు తెలంగాణ యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి పనిచేస్తుందని బాలకిష్టారెడ్డి వివరించారు. కళాశాలల్లో క్యాలిటీ టీచింగ్, మానిటరింగ్, అకడమిక్ పార్టిసిపేషన్, రీసెర్చ్ తదితర అంశాలను తప్పనిసరిగా పాటించాలని చైర్మన్ సూచించారు. వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి ప్రత్యేక కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలకు, ఆయా కళాశాలకు తగిన సలహాలుసూచనలు అందిస్తున్నామన్నారు. మండలి మరో వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో పాటు నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎన్ని ఉన్నత చదువులు చదివినా నైపుణ్యం లేని చదువువల్ల ప్రయోజనం, ఉపాధి రెండూ ఉండవన్నారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ యూనివర్సిటీ లేదా కళాశాల తాము నిర్వహించే కోర్సులకు సంబంధించి ఖచ్చితంగా ల్యాబ్స్ నిర్వహించాలని సూచించారు. కొత్త కోర్సులు ప్రారంభించి వదిలివేయడమే కాకుండా వాటిపై తప్పనిసరిగా తమ వైపు నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

మజ్లిస్‌ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

- **స్పీకర్‌ను కోరిన కేంద్ర మంత్రి బండి సంజయ్**
- **అసెంబ్లీలో 'వందేమాతరం' వివాదం**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: రాష్ట్ర అసెంబ్లీలో "వందేమాతరం" గేయం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మజ్లిస్ నేతల ప్రవర్తనపై స్పీకర్ స్పందించకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారని గుర్తుచేస్తూ, వందేమాతరం గేయం ఆలపించే సమయంలో సభ్యులంతా లేచి గౌరవించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. పవిత్రమైన అసెంబ్లీ వేదికగా మజ్లిస్ ఎమ్మెల్యేలు గేయాన్ని అవమానిస్తే స్పీకర్ ప్రేక్షక పాత్ర వహించడం సరైందా అని ప్రశ్నించారు. గవర్నర్, స్పీకర్, మండలి చైర్మన్ సమక్షంలో జరిగిన ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో సందేహాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. 2026లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం తప్పనిసరి అని గుర్తుచేశారు. వందేమాతరం ఆలాపన సమయంలో అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన మజ్లిస్ ఎమ్మెల్యేలకు ఇప్పటివరకు నోటీసులు ఇవ్వకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారా? అని విమర్శించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో స్పీకర్ ఇచ్చిన తీర్పుతోనే శాసన వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం దెబ్బతిన్నదని ఆరోపించారు. నిండు సభలోనే జరిగిన ఈ ఘటనపై చర్యలు తీసుకోకపోతే ప్రజలకు తప్పుడు సందేశం వెళ్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను ఉద్దేశిస్తూ, ఈ ఘటన సమయంలో మంత్రులతో కలిసి సభలో ఉన్నప్పటికీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సభ నియమ నిబంధనలు, కేంద్ర ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.అలాగే, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడుతున్న నేపథ్యంలో, ఆ రాజ్యాంగానికి అనుగుణంగా కేంద్ర ఉత్తర్వులను అమలు చేయాలనే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. గవర్నర్ సమక్షంలోనే ఉల్లంఘన జరిగినా చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో తప్పుడు సందేశం వెళ్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించిన మజ్లిస్ ఎమ్మెల్యేలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మా దాడిలో ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజనీ చనిపోయారు. 'బసిజ్' పారామిలిటరీ చీఫ్ గోలమ్‌రెజా సులేమానీ సైతం ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లో తమ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రభుత్వాన్ని పడగొట్టే అవకాశాన్ని ఇరాన్ ప్రజలకు కల్పించాలనే ఆశతోనే ఈ అటాక్స్ చేస్తున్నాం. అన్నీ ఒకేరోజులో జరగవు. స్థిరంగా పోరాడితే అన్నీ సాధ్యమే.

- ఇజ్రాయెల్ పీఎం నెతన్యాహు

ఓపెన్ వాయిస్

పెట్రోల్, డీజిల్, ఎరువులపై యుద్ధ ప్రభావం

యుద్ధాల్లో స్పష్టమైన విజేతలు ఉండటం చాలా అరుదు. సామాన్య ప్రజలే తరచూ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది.ప్రపంచ ఇంధన మార్కెట్లు, సరఫరా గొలుసులు అస్తవ్యస్తంగా మారడంతో, కొన్ని దేశాలు తీవ్ర ఆర్థిక పర్యవసనాలను ఎదుర్కోవాల్సి వస్తోంది.అయితే ఇంతటి అనిశ్చితిలోనూ కొన్ని దేశాలు సరికొత్త వ్యూహాత్మక అవకాశాల కోసం చూస్తున్నాయి.ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆ ప్రాంతంలో ప్రతికూల పరిణామాలను కలిగిస్తోంది.గల్ఫ్ దేశాలను అస్థిరపరిచింది. మధ్య ప్రాచ్యంలోని వేలాది మంది ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తమ ఇళ్లను విడిచి బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.చమురు ధరల పెరుగుదల, గల్ఫ్‌లో హార్ముజ్ జలసంధి వద్ద సముద్ర రవాణాకు కలుగుతున్న అంతరాయం వ్యాపారులకు, వినియోగదారులకు మరింత ఖర్చును పెంచుతోంది.ఇరాన్ రష్యాకు కీలకమైన మిత్రదేశం. అత్యంత ముఖ్యమైన సైనిక భాగస్వామి. సిరియాలో బషర్ అల్‌అసద్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడం, వెనెజ్వెలాలో నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన తర్వాత.. మాస్కోకు దౌత్యపరంగా ఎదురైన మరో ఎదురుదెబ్బ ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో మరణించడం. అయితే, మధ్య ప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభం యుక్రెయిన్‌తో రష్యా తలపడుతోన్న యుద్ధానికి ప్రయోజనకరంగా మారవచ్చు. ఎందుకంటే, అమెరికా తన సైనిక బలగాలను మధ్య ప్రాచ్య సంక్షోభం వైపు మళ్లించవచ్చు.'' పేట్రియాట్ క్షిపణులు, ఇంటర్‌సెప్టార్లు తగ్గిపోవడం రష్యాకు ప్రయోజనకరంగా మారుతుంది. దీనివల్ల యుక్రెయిన్‌కు అందే ఆయుధాల సంఖ్య తగ్గిపోతుంది'' అని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌కు చెందిన పారిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ స్టడీస్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ నికోల్ గ్రాజేవ్‌స్కీ పర్షియన్‌కు చెప్పారు.తెహ్రాన్‌కు షాహెద్ డ్రోన్ల అవసరం పెరిగినందువల్ల యుక్రెయిన్‌లో మాస్కో సామర్థ్యాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపకపోవచ్చని నిపుణులు అంటున్నారు.''యుక్రెయిన్‌తో యుద్ధం మొదలైనప్పుడు ఒక నిర్దిష్ట కాలం పాటు రక్షణ సహకారాల్లో భాగంగా రష్యా ఇరాన్‌పై ఆధారపడింది. అప్పుడు ఇరాన్ షాహెద్ డ్రోన్లను అందించింది. ముఖ్యంగా 2022-23ల్లో వీటి ప్రొడక్షన్ టెక్నాలజీని, ఈ డ్రోన్ల లైసెన్స్‌లను రష్యాకు అందించింది'' అని అమెరికాలోని సెంటర్ ఫర్ నాన్‌ప్రొలిఫరేషన్ స్టడీస్‌కు చెందిన యురేసియా డైరెక్టర్ హన్నా నోట్ తెలిపారు.'ఇప్పుడు యుక్రెయిన్‌లో యుద్ధం కొనసాగించడానికి రష్యాకు ఇరాన్ మద్దతు అవసరం లేని దశలో ఉంది. రష్యా సొంతంగా షాహెద్ డ్రోన్లను ఉత్పత్తి చేసుకోగలదు'' అని తెలిపారు.ఇదే సమయంలో చమురు, గ్యాస్ సరఫరాలకు అత్యంత కీలక మార్గమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో చమురు ధరలు పెరిగాయి. ఇది యుక్రెయిన్ యుద్ధంతో తీవ్ర ఒత్తిడికి గురైన రష్యాకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తుంది.రష్యా బడ్జెట్ ఎక్కువగా ఆ దేశ చమురు ఎగుమతులపైనే ఆధారపడింది. అప్పట్లో బ్యారల్ చమురు ధర 59 డాలర్లు ఉండేది. ప్రస్తుతం ముడి చమురు ధర గణనీయంగా పెరిగింది. ఒకానొక సమయంలో బ్యారల్ సుమారు 120 డాలర్లకు ఎగిసింది.గల్ఫ్‌లోని ప్రముఖ చమురు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గించడంతో.. ప్రస్తుతం చైనా, భారత్ వంటి ముఖ్యమైన మార్కెట్లకు రష్యా మరింత ఎక్కువగా ఎగుమతి చేసే అవకాశం ఉంది. ఈ సమస్యల నుంచి కొంత బయటపడేందుకు రష్యా చమురుపై ఆంక్షలను సడలించాలని ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి.ఇరాన్ యుద్ధం వల్ల చైనాపై పడే ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా చూడాల్సి ఉంది.చైనా ముడిచమురు దిగుమతుల్లో కేవలం 12 శాతం మాత్రమే ఇరాన్ నుంచి వస్తుందని సెంటర్ ఆన్ గ్లోబల్ ఎనర్జీ పాలసీ తెలిపింది.పైగా, చైనాలో కొన్ని నెలలకు సరిపడా చమురు సరఫరాలున్నాయి. ఆ తర్వాత తేలికగా రష్యా సాయాన్ని కూడా చైనా కోరుతుండొచ్చు. వియత్నాంలో ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి డీజిల్ ధర 60 శాతం పెరిగింది. వీలైతే ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచే పనిచేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది.మధ్య ప్రాచ్యం నుంచి ముడిచమురు దిగుమతులపైనే 95 శాతం ఆధారపడ్డ ఫిలిప్పీన్స్‌లో ఎమర్జెన్సీ సేవల్లో పనిచేసే వారు మినహాయించి ప్రభుత్వ రంగ ఉద్యోగులు ప్రస్తుతం వారానికి నాలుగు రోజులే పనిచేస్తున్నారు.పాకిస్తాన్‌లో కూడా ఇదే రకమైన ఆంక్షలను ప్రవేశపెట్టారు. వీలైనప్పుడల్లా వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలను జారీ చేస్తున్నారు. యూనివర్సిటీ తరగతులన్నీ ఆన్‌లైన్‌లోకి మారాయి.యుద్ధభయంతో భారీ కొనుగోళ్ల కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇబ్బంది పడుతోంది. కార్లకు రోజుకు 10 లీటర్లు, మోటార్‌సైకిళ్లకు కేవలం రెండు లీటర్లు మాత్రమే ఇచ్చేలా పలు నిర్ణయాలను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా రైతులు తమ పంటల కోసం ఎరువులపై ఆధారపడ్డారు. ఈ ఎరువుల రవాణాలో అంతరాయాలు ఏర్పడితే, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతకు ప్రమాదం వాటిల్లనుంది.'' ప్రపంచ యూరియాలో 30 శాతం హార్ముజ్ జలసంధి మీదుగానే వస్తుంది. పెట్రో కెమికల్స్ నుంచి యూరియా వస్తుంది. ప్రపంచ మార్కెట్ల నుంచి 30 శాతం యూరియాను తీసివేస్తే, ప్రపంచ ఆహార భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపనుంది'' థింక్ ట్యాంక్ చాథమ్ హౌస్ మిడిల్ ఈస్ట్ నిపుణులు నీల్ క్విలియం తెలిపారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
18.03.2026

మనుషులు కలిసుంటున్నారు.. మనసులు కలుస్తున్నాయా?



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

మనిషి సామాజిక జీవి ఈ వాక్యం మనం చిన్నప్పటి నుండి వింటున్నదే. సమాజం లేనిదే మనిషి మనుగడ కష్టం, సంబంధాల కలబోతే జీవితం. పుట్టినప్పటి నుండి గిట్టే వరకు మనిషి ఏదో ఒక రూపంలో ఇతరులపై ఆధారపడుతూనే ఉంటాడు. కానీ, 21వ శతాబ్దపు ఉరుకుల పరుగుల జీవనంలో ఒక విచారకరమైన నిజాన్ని మనం అంగీకరించక తప్పదు. అదేమిటంటే, భౌతికంగా మనం అందరికీ చేరువలో ఉన్నా, మానసికంగా మాత్రం మునుపెన్నడూ లేనంత ఒంటరిగా మారిపోతున్నాం. మనుషుల మధ్య ఉండాల్సిన అనురాగం, ఒకరి బాధను మరొకరు అర్థం చేసుకునే సహానుభూతి (Empathy) క్రమంగా కరువవుతున్నాయి. ఈ భావోద్వేగ శూన్యత వల్ల వ్యక్తుల మధ్య కనిపించని గోడలు నిర్మాణమవుతున్నాయా? అంటే, సమాజపు ప్రస్తుత స్థితిని చూస్తే అవును అనే సమాధానమే వినిపిస్తోంది. ఈ ప్రశ్న నేటి ఆధునిక సమాజానికి అత్యంత ప్రాసంగికమైనది మరియు ఆందోళనకరమైనది కూడా. అనురాగం అంటే కేవలం ఒక వ్యక్తిపై చూపే ప్రేమ మాత్రమే కాదు. అది అంతకంటే గంభీరమైనది. అది మనుషుల మధ్య ఉండే ఒక అదృశ్య వారధి. ఎదుటివారి కళ్ళలోని కన్నీటిని చూడగానే మన మనసు ద్రవించడం, వారి చిరునవ్వులో మన సంతోషాన్ని వెతుక్కోవడం ఇదే అసలైన అనురాగం. ఈ భావన ఉన్నప్పుడే కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. స్నేహాలు కాలపరీక్షకు నిలబడతాయి. ఒకప్పుడు మన గ్రామాలు, వాడలు ఎలా ఉండేవో గుర్తు చేసుకుంటే, అక్కడ నేను కంటే మనం అనే భావనే ఎక్కువగా ఉండేది. మన పూర్వీకులు వసుధైవ కుటుంబకం అనే గొప్ప సూత్రాన్ని పాటించారు. అంటే ఈ ప్రపంచమంతా ఒకే కుటుంబం అని అర్థం. పక్కింటి అబ్బాయి అల్లరి చేస్తే మన ఇంట్లో మందలించే అధికారం ఉండేది. ఎవరి ఇంట్లో శుభకార్యం జరిగినా ఊరంతా తమ ఇంట్లోని పనిలా భావించి చేసేవారు. పొరుగువారి కష్టం తమ కష్టంగా భావించే ఆత్మీయత ఉండేది. కానీ నేడు ఆ దృశ్యం పూర్తిగా మారిపోయింది. అపార్ట్మెంట్ సంస్కృతిలో పక్క ఫ్లాట్ లో ఎవరు ఉంటున్నారో, వారు ఏ కష్టంలో ఉన్నారో కూడా తెలియని స్థితికి చేరుకున్నాం. మన తలుపులు మాత్రమే కాదు, మన హృదయ కవాటాలు కూడా మూసుకుపోయాయి. అనురాగం తగ్గుతున్న కొద్దీ, మనుషుల మధ్య అపనమ్మకం అనే గోడలు పెరుగుతున్నాయి. ఈ గోడలు ఇటుకలతో కట్టినవి కావు, ఇవి అంతకంటే బలమైనవి. ఇవి మనుషులను విడదీస్తున్నాయి, నేడు ఒకే ఇంట్లో నలుగురు వ్యక్తులు ఉన్నా, నలుగురూ నాలుగు వేర్వేరు ప్రపంచాల్లో గడుపుతున్నారు. డైనింగ్ టేబుల్ మీద భోజనం చేస్తున్నప్పుడు కూడా సంభాషణల కంటే మొబైల్ నోటిఫికేషన్ల శబ్దాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు పిల్లల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ పెరుగుతోంది. పిల్లలు తమ సమస్యలను తల్లిదండ్రులకు చెప్పుకోవడానికి భయపడుతున్నారు లేదా సంకోచిస్తున్నారు. ఈ మానసిక దూరం మనుషులను ఒకే ఇంట్లో అపరిచితులుగా మారుస్తోంది. ప్రైవసీ (Privacy) అనే పేరుతో మనం ఒక గీత గీసుకున్నాం. ఎవరూ మన జీవితంలోకి రాకూడదు, మనం ఎవరి విషయంలోనూ జోక్యం చేసుకోకూడదు అనే ధోరణి పెరిగింది. ఇది ఒక రకమైన సామాజిక ఐసోలేషన్ . గతంలో రచ్చబండలు, కమ్యూనిటీ మీటింగ్లు మనుషులను కలిపేవి. ఇప్పుడు ప్రతి ఇల్లు ఒక ద్వీపంలా మారిపోయింది. ఇతరుల పట్ల కనికరం చూపడం బలహీనతగా భావించే రోజులు వచ్చాయి. రోడ్డు మీద ఎవరైనా



ప్రమాదానికి గురైతే, సాయం చేయడం కంటే వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇది మానవత్వం చచ్చిపోతుందనడానికి నిదర్శనం. మనుషుల మధ్య ఈ దూరం రావడానికి ప్రధానంగా కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి, ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు మనిషి ఒక యంత్రంలా మారిపోయాడు. ఆఫీసు ఒత్తిడి, టార్గెట్లు, ట్రాఫిక్ ఇవన్నీ మనిషిలోని సహజసిద్ధమైన శాంతిని హరిస్తున్నాయి. ఇక టెక్నాలజీ విషయానికి వస్తే, స్మార్ట్‌ఫోన్ మనల్ని ప్రపంచానికి కనెక్ట్ చేసింది కానీ, పక్కనే ఉన్న మనిషికి దూరం చేసింది. లైక్‌లు, కామెంట్ ల కోసం పడే తపన, ఎదుటి వ్యక్తితో ప్రత్యక్షంగా మాట్లాడటంలో కనిపించడం లేదు. నేటి విద్యా విధానం మరియు కార్పొరేట్ సంస్కృతి మనిషిని నిరంతరం పోటీలో ఉంచుతున్నాయి. సహచర విద్యార్థి లేదా ఉద్యోగి ఒక స్నేహితుడిలా కాకుండా ఒక ప్రత్యర్థిలా కనిపిస్తున్నాడు. ఈ పోటీ మనస్తత్వం వల్ల ఇతరుల ఎదుగుదలను చూసి ఓర్వలేని తనం, అసూయ పెరుగుతున్నాయి. నేటి సమాజంలో మనిషి విలువను అతని క్యారెక్టర్ కంటే అతని బ్యాంక్ బ్యాలెన్స్, కారు, ఇల్లు బట్టి కొలుస్తున్నారు. డబ్బు సంపాదనలో పడి మనుషులు ఆత్మీయతలను తాకట్టు పెడుతున్నారు. డబ్బుంటేనే గౌరవం అనే సూత్రం సమాజంలో బలంగా నాటుకుపోవడం వల్ల, భావోద్వేగాల కంటే భౌతిక సంపదకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకప్పుడు మనిషిని నమ్మి ప్రాణాలిచ్చేవారు. ఇప్పుడు ప్రతి చిన్న విషయానికి అనుమానం. మోసాలు పెరిగిపోవడం వల్ల ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియని అయోమయ స్థితిలో మనిషి తన చుట్టూ తాను ఒక రక్షణ కవచాన్ని (గోడను) నిర్మించుకుంటున్నాడు. ఈ గోడలు కేవలం సామాజిక సమస్యలే కాదు, ఇవి తీవ్రమైన వ్యక్తిగత సంక్షోభాలకు కారణమవుతున్నాయి అనురాగం కరువైన చోట ఒంటరితనం రాజ్యం ఏలుతుంది. ఈ ఒంటరితనం వల్ల డిప్రెషన్, యాంగ్జయిటీ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, మానసిక సమస్యలకు ప్రధాన కారణం సామాజిక మద్దతు (Social Support) లేకపోవడమే. మనిషి తన బాధను పంచుకోవడానికి ఎవరూ లేరని భావించినప్పుడు ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నాడు. చిన్న చిన్న విభేదాలకే విడాకులు తీసుకోవడం, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను అనాథాశ్రమాలకు పంపడం వంటివి అనురాగ లేమికి పరాకాష్ట. సంప్రదాయ ఉమ్మడి కుటుంబాల నుండి చిన్న కుటుంబాల వైపు మారాం, ఇప్పుడు ఆ చిన్న కుటుంబాలు కూడా ముక్కలవుతున్నాయి. మనుషుల మధ్య ప్రేమాభిమానాలు తగ్గినప్పుడు సమాజంలో క్రూరత్వం పెరుగుతుంది. చిన్న కారణాలకే గొడవలు పడటం, రోడ్ రేజ్, చిన్న పిల్లలపై అకృత్యాలు ఇవన్నీ మనిషిలో మానవత్వం తగ్గుతున్నదానికి సంకేతాలు. ఈ స్థితిని మార్చడం అసాధ్యం కాదు, కానీ అది ప్రతి ఒక్కరితోనే మొదలవ్వాలి. రోజులో కనీసం గంటసేపు ఫోన్లను పక్కన పెట్టి కుటుంబ సభ్యులతో మనసు విప్పి మాట్లాడాలి. పిల్లలతో ఆడుకోవాలి, పెద్దల అనుభవాలను అడిగి తెలుసుకోవాలి. కలిసి భోజనం చేయడం అనేది ఒక గొప్ప ఆచారం, దాన్ని మళ్లీ ప్రాణం పోయాలి. మన పొరుగువారితో చిన్న పలకరింపుతో సంబంధాన్ని మొదలుపెట్టాలి. కష్టంలో ఉన్నవారికి మనకు తోచిన సాయం చేయాలి. అది ఆర్థిక సాయమే కానక్కర్లేదు, ఒక చిన్న ఓదార్పు మాట కూడా చాలు. ఎదుటి వ్యక్తి స్థానంలో ఉండి ఆలోచించడం నేర్చుకోవాలి. వారి తప్పులను ఎత్తిచూపే ముందు, వారు ఆ పరిస్థితిలో ఎందుకున్నారో అర్థం చేసుకోవాలి. క్షమించే గుణాన్ని అలవరుచుకోవాలి. మన పిల్లలకు ర్యాంకులు ఎంత ముఖ్యమో, పక్కవాడికి సాయం చేయడం కూడా అంతకంటే ముఖ్యం అని నేర్పాలి. కథల ద్వారా, మన ప్రవర్తన ద్వారా వారికి మానవత్వపు విలువలను అందించాలి. అనురాగం తగ్గితే మనుషుల మధ్య గోడలు పెరుగుతాయా? అంటే, అవును, ఇప్పటికే ఆ గోడలు చాలా ఎత్తుగా పెరిగిపోయాయి. కానీ ఆ గోడలను కూల్చే శక్తి ఒక్క ప్రేమానురాగాలకే ఉంది. టెక్నాలజీ, డబ్బు, హోదా ఇవన్నీ మనకు సౌకర్యాన్ని ఇస్తాయి కానీ సంతోషాన్ని ఇవ్వలేవు. నిజమైన సంతోషం మనం ఇచ్చే ప్రేమలో, పొందే ఆత్మీయతలో ఉంది. మనం మనుషులం, రక్తమాంసాలతో పాటు భావోద్వేగాలు ఉన్న ప్రాణులం. యంత్రాల్లాగా కేవలం ఇన్ పుట్, అవుట్ పుట్ లతో బతికేయకూడదు. హృదయ విశాలతను పెంచుకోవాలి. అపనమ్మకం ఉన్న చోట నమ్మకాన్ని, ద్వేషం ఉన్న చోట ప్రేమను, స్వార్థం ఉన్న చోట త్యాగాన్ని నింపాలి. గుర్తుంచుకోండి, మనం వెళ్లేటప్పుడు తీసుకువెళ్లేది ఏమీ లేదు, కానీ మనం పంచిన ప్రేమ, అనురాగం ఇతరుల హృదయాల్లో మనల్ని చిరస్థాయిగా నిలబెడతాయి. ఈ రోజే, ఇప్పుడే ఆ కనిపించని గోడలను కూల్చేద్దాం. ఒకరికొకరు తోడుగా ఉంటూ, వసుధైవ కుటుంబకానికి పునర్జీవం పోద్దాం. అప్పుడే మన సమాజం ఆరోగ్యంగా, ఆనందంగా వికసిస్తుంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

ప్రకృతిలోని ఉష్ణ నియంత్రణ రహస్యాలు..!



గిలకత్తుల వెంకటరమణ గౌడ్
9866878769

ప్రకృతిని పరిశీలించినప్పుడు మొక్కలు నిశ్చలంగా కనిపిస్తాయి. అవి జంతువులలాగా కదలలేవు, ప్రమాదకర పరిస్థితుల నుంచి దూరంగా వెళ్లలేవు. అయినప్పటికీ ఎడారి ప్రాంతాల్లోని తీవ్రమైన ఎండలను, హిమప్రాంతాల్లోని తీవ్రమైన చలిని తట్టుకొని జీవిస్తాయి. దీనికి కారణం మొక్కలలో అభివృద్ధి చెందిన అద్భుతమైన నిర్మాణాత్మక, జీవక్రియాత్మక,జీవరసాయనిక (biochemical) అనుకూలనాలు. ఈ అనుకూలతలు మొక్కల పరిణామ క్రమంలో అభివృద్ధి చెందిన సహజ వ్యూహాలు. ప్రకృతి తన జీవులను రక్షించుకునే విధానాల్లో మొక్కల అనుకూలనాలు అత్యంత ఆసక్తికరమైనవి.

మొక్కల సహజ వ్యూహాలు

మొక్కలు తమలో ప్రత్యేకంగా ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థలు లేకపోయినా, వాటి నిర్మాణం మరియు జీవక్రియల ద్వారా వాతావరణ ప్రభావాన్ని తగ్గించగలవు. మొక్కల ఆకులు, కాండం, వేర్లు మరియు కణస్థాయిలో జరుపుకునే మార్పులు ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడతాయి. శాస్త్రవేత్తలు ఈ లక్షణాల ఆధారంగా మొక్కలను ప్రకృతిలో సహజ ఉష్ణ నియంత్రణ ఇంజనీర్లుగా అభివర్ణిస్తారు

ఎండలో చల్లగా ఉండటానికి

ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రత మొక్కల కణజాలానికి హానికరం. అందువల్ల మొక్కలు తమ భాగాలను చల్లగా ఉంచుకునే పద్ధతులను అభివృద్ధి చేసుకున్నాయి. వాటిలో ముఖ్యమైనది ట్రాన్స్‌పిరేషన్ (Transpiration). మొక్కల ఆకులపై ఉన్న స్టోమాటా (stomata) అనే సూక్ష్మ రంధ్రాల ద్వారా నీటి ఆవిరి బయటకు వెళుతుంది. ఈ ఆవిరీభవన ప్రక్రియలో ఆకులోని వేడి ఉపయోగించబడుతుంది. ఫలితంగా ఆకుల ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఇది మనుషుల చెమట ప్రక్రియతో పోల్చవచ్చు. ఎడారి ప్రాంతాల్లో పెరిగే మొక్కలు ప్రత్యేక నిర్మాణాలను కలిగి ఉంటాయి. ఉదాహరణకు కాక్టస్ వంటి మొక్కల కాండం మందంగా ఉండి నీటిని నిల్వ చేస్తుంది. ఆకులు ముళ్లుగా మారడం వల్ల నీటి నష్టం తగ్గుతుంది. అనేక మొక్కల ఆకులపై ఉండే మైనపు పొర (cuticle) నీటి ఆవిరీభవనాన్ని తగ్గిస్తుంది. కొన్ని మొక్కలు మధ్యాహ్నం సమయంలో ఆకుల దిశను మార్చి నేరుగా సూర్యకాంతి పడకుండా చూసుకుంటాయి.

చలిలో రక్షణకు అనుకూలతలు

మొక్కలు చల్లని వాతావరణంలో కూడా జీవించడానికి ప్రత్యేకమైన అనుకూలతలను కలిగి ఉంటాయి. చలికాలంలో చాలా మొక్కలు శీతకాల నిద్ర (winter dormancy) అనే దశలోకి వెళ్తాయి. ఈ సమయంలో వాటి జీవక్రియలు మందగించి శక్తి వినియోగం తగ్గుతుంది.వృక్షాలలో మొగ్గలపై బడ్ స్కేల్స్ అనే మందమైన రక్షణ పొరలు ఏర్పడతాయి. ఇవి చలి గాలులు మరియు మంచు నుండి కొత్త కాండాలు, ఆకులను రక్షిస్తాయి. పైన్ మరియు స్ప్రూస్ వంటి వృక్షాలలో సూదిలాంటి ఆకులు ఉండటం వల్ల మంచు పేరుకుపోవడం తగ్గుతుంది. దీని వల్ల కొమ్మలు విరిగే ప్రమాదం తగ్గుతుంది. కణస్థాయిలో కూడా కొన్ని రక్షణ మార్పులు చేసుకుంటాయి. చలికాలంలో మొక్కల కణాలలో చక్కెరలు మరియు ప్రత్యేక ప్రోటీన్లు పెరుగుతాయి. ఇవి సహజ యాంటీఫ్రీజ్ పదార్థాల్లా పనిచేసి కణాలలో మంచు ఏర్పడకుండా కాపాడుతాయి.



వేడి ఉత్పత్తి చేసే పుష్పాలు

ప్రకృతిలో కొన్ని మొక్కలు స్వల్పంగా వేడి ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ ప్రక్రియను థర్మోజెనెసిస్ (Thermogenesis) అంటారు. మొక్కల కణాలలోని మైటోకాండ్రియాలో జరిగే శక్తి మార్పిడి ప్రక్రియల వల్ల ఈ వేడి ఉత్పత్తి అవుతుంది. భారతదేశపు పవిత్ర కమలం (Nelumbo nucifera) ఈ లక్షణానికి ప్రసిద్ధ ఉదాహరణ. పువ్వు పూసే సమయంలో దాని మధ్య భాగంలో స్వల్పంగా ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఈ వేడితో తేనెటీగలు మరియు ఇతర పరాగసంపర్క పురుగులను పలదీకరణానికి ఆకర్షిస్తుంది. ఉత్తర అమెరికాలో కనిపించే స్కంక్ కాబేజీ అనే మొక్క మంచు మధ్యలో కూడా పూస్తుంది. ఇది తనలో ఉత్పత్తి చేసే వేడి వల్ల చుట్టూ ఉన్న మంచును కరిగించగలదు. ప్రపంచంలోనే అతిపెద్ద పుష్ప నిర్మాణాలలో ఒకటైన టైటాన్ అరమ్ కూడా పూసే సమయంలో వేడి ఉత్పత్తి చేసి దుర్వాసన ద్వారా పురుగులను ఆకర్షిస్తుంది.

పరిణామంలో వ్యూహాలు

ఈ అన్ని లక్షణాలు మొక్కల పరిణామ క్రమంలో అభివృద్ధి చెందిన జీవశాస్త్ర వ్యూహాలను సూచిస్తాయి. వేడి ఉత్పత్తి చేయడం, ఎండలో చల్లగా ఉండే నిర్మాణ ప్రక్రియలు, పరాగ సంపర్కానికి అధిక వేడిని ఉత్పత్తి చేయడం ,నీటిని నిల్వ చేయడం, ఆకుల నిర్మాణాన్ని మార్చడం, కణాలలో రక్షణ రసాయనాలను ఉత్పత్తి చేయడం వంటి పద్ధతులు మొక్కలకు వాతావరణ ఒత్తిడులను తట్టుకునే సామర్థ్యాన్ని ఇస్తాయి. ఈ అనుకూలనాలు, మనుగడ వ్యూహాలు మొక్కల జీవనానికి మాత్రమే కాకుండా వాటి పునరుత్పత్తి విజయానికి కూడా కీలకంగా ఉంటాయి. ప్రకృతి నిశ్చలంగా కనిపించినప్పటికీ సంక్లిష్టమైన జీవశాస్త్ర ప్రక్రియలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. ప్రతి పువ్వు, ప్రతి ఆకూ ఒక చిన్న శాస్త్రీయ ప్రయోగశాల వంటిదని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ అనుకూలనాలను అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తులో వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయ పద్ధతులు మరియు పంటల అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి.


(వ్యాసకర్త జీవశాస్త్ర ఉపాధ్యాయులు)

దేశ చరిత్రలో తొలి కారుణ్య మరణం



కోట దామోదర్
9391480475

జీవితం అనేది ఆశలతో నిండిన ప్రయాణం. ప్రతి తల్లి తండ్రి తన పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని కలలు కంటారు. కానీ కొన్నిసార్లు విధి మనుషుల మనసును పిండేసే పరిస్థితులను తీసుకొస్తుంది. అలాంటి హృదయ విదారక సంఘటనల్లో ఒకటి కారుణ్య మరణం. తన కన్న బిడ్డ కోసం ఒక సంవత్సరం కాదు, రెండు సంవత్సరాలు కాదు... ఏకంగా పదమూడు సంవత్సరాలు ఆశతో ఎదురు చూసిన తల్లిదండ్రులు. తమ బిడ్డ ఎప్పుడో ఒక రోజు కోలుకుని మళ్లీ నవ్వుతాడనే నమ్మకంతో కాలాన్ని గడిపారు. కానీ కాలక్రమేణా వైద్యులు చెప్పిన నిజం వారి ఆశలను మెల్లగా చెదరగొట్టింది. ఇక ఆ బిడ్డ కోలుకునే అవకాశం లేదని. ఆ సమయంలో తల్లిదండ్రుల మనసులో ఒకే ప్రశ్న మెదిలింది: "మేము ఉన్నంతవరకు మా బిడ్డను చూసుకుంటాం... కానీ మేము లేని తర్వాత అతన్ని చూసుకునేది ఎవరు?" జీవచ్ఛవంలా బతుకుతున్న హరీష్‌రానా కు కారుణ్య మరణం అనుమతించాలని కన్న తల్లిదండ్రులే 2011లో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును వైద్య నిపుణుల బృందం సంవత్సరాల పాటు క్షుణ్ణంగా పరిశీలించింది. రోగి పరిస్థితి, వైద్య నివేదికలు, కుటుంబ సభ్యుల వాదనలు అన్నింటినీ విశ్లేషించిన తర్వాత కోర్టు తుది నిర్ణయం తీసుకుంది. చివరకు 2026 మార్చి 16న కారుణ్య మరణానికి అనుమతి లభించింది. ఆ సమయంలో తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయి దేశవ్యాప్తంగా ప్రజలను కదిలించింది. ఆ వీడియో చూసిన ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్లు తెప్పించేంత భావోద్వేగం ఉంది. తల్లిదండ్రుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఇప్పటివరకు లైఫ్ సపోర్ట్ ద్వారా బతికిస్తున్న వైద్యులకే ఆ లైఫ్ సపోర్ట్‌ను తొలగించాలని ఆదేశించింది. దీంతో తల్లిదండ్రులు తమ బిడ్డకు చివరిసారిగా తుది వీడ్కోలు పలికారు.ఆ సమయంలో ఆధ్యాత్మిక ధైర్యం ఇచ్చేందుకు Brahma Kumaris సంస్థకు చెందిన ఒక సోదరి, "అందరినీ క్షమించు... ఇక వెళ్లాల్సిన సమయం వచ్చింది" అని చెప్పిన మాటలు అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించింది. భారతదేశంలో కారుణ్య మరణంపై చట్టపరమైన చర్చకు మార్గం చూపిన ప్రముఖ కేసు అరుణ శాన్‌బాగ్ కేసు. ఈ కేసు ఆధారంగా 2011లో సుప్రీంకోర్టు పాసివ్ యూతనేషియాను కొన్ని కఠిన నిబంధనలతో అనుమతించింది. అంటే కోలుకునే అవకాశం లేని రోగికి కుటుంబ సభ్యులు, వైద్యులు, హాస్పిటల్ కమిటీ మరియు కోర్టు అనుమతితో మాత్రమే లైఫ్ సపోర్ట్ తొలగించవచ్చు. తర్వాత 2018లో సుప్రీంకోర్టు మరో కీలక



తీర్పు ఇచ్చి "లివింగ్ విల్" అనే విధానానికి చట్టపరమైన గుర్తింపు ఇచ్చింది. లివింగ్ విల్ అంటే ఒక వ్యక్తి తీవ్రమైన అనారోగ్యం తో స్పృహ కోల్పోయినప్పుడు లేదా కోలుకునే అవకాశం లేకపోయినప్పుడు, తనకు కృత్రిమంగా జీవితం పొడిగించే చికిత్సలు చేయకూడదని ముందుగానే రాసి పెట్టిన చట్టబద్ధ ప్రకటన. ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, రోగి పట్ల కుటుంబ సభ్యులు బాధాకరమైన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి రాకుండా చేయడం, అలాగే రోగి స్వంత అభిప్రాయాన్ని గౌరవించడం. అదే సమయంలో అనవసరమైన బాధను తగ్గించడం కూడా.ఇప్పటివరకు భారతదేశంలో కారుణ్య మరణం పూర్తిగా స్వేచ్ఛగా అనుమతించబడలేదు. కేవలం కఠిన నిబంధనల మధ్య పాసివ్ యూతనేషియా మాత్రమే అనుమతించబడుతోంది. అయినప్పటికీ, ఈ సంఘటన మానవత్వం, చట్టం, వైద్యం ... ఈ మూడింటి మధ్య ఉన్న సంక్లిష్ట సంబంధాన్ని మనకు గుర్తు చేస్తుంది.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం





పెచ్చుమీరుతున్న ప్రైవేటు విద్యాసంస్థల అక్రమాలు

- ధనార్జనే ధ్యేయంగా నిబంధనల ఉల్లంఘన
- తెలిసీ.. కళ్లు మూసుకున్న అధికారులు?
- అక్రమాలపై మీడియాలో కథనాలు
- వివరణ కోరితే అధికారుల నిర్లక్ష్యపు సమాధానం
- అధికారులు మారినా తీరు మార్చుకోని పాఠశాలలు
- ఇంత జరిగినా పట్టించుకోని జిల్లా విదాయశాఖ అధికారులు



ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, మార్చి 17: బండ్లగూడ మండలంలో ప్రయివేటు పాఠశాలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా పాఠశాలలను నిర్వహిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహించడే కాకుండా, అనుమతులు లేకుండా సీబీఎస్ఈ క్లాసులు నిర్వహిస్తూ, లక్షల్లో ఫీజులు దండుకుంటున్నాయి. కాగా ప్రయివేటు పాఠశాలలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, విద్యార్థుల భవిష్యత్తు ఏమైనా పర్వాలేదు అన్నట్లుగా విద్యా శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. కాసులుల ఇస్తే చాలు ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు. జీవో నెంబర్ వన్ అమలు చేయకుండా విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా విద్యా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తునన్నారు. కాసులు ఇస్తే చాలు ఎటువంటి అనుమతులైన మంజూరు చేస్తున్నారని, డిప్యూటీ ఈఓ కార్యాలయం అధికారులపై అనేక విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికారుల తీరుపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇటీవల ఇదే కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు కూడా జరిగాయి. డిప్యూటీ ఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కడం చర్చనీయాంశంగా మారింది. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారులు మారినా ప్రయివేటు పాఠశాల తీరు మారడం లేదు. మండలంలో ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనేది వాస్తవం.

అనుమతులు లేకున్నా సీబీఎస్ఈ తరగతులు

బండ్లగూడ మండలం ఫలక్నామా ప్రాంతంలో నారాయణ స్కూల్ అనుముతులు లేకున్నా సీబీఎస్ఈ కరక్యులమంటూ యథేచ్ఛగా తరగుతులు నిర్వహిస్తూ, విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోయారు. అధిక ఫీజులకు తోడు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలోనే పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులకు అదనంగా వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై బండ్లగూడ మండల డిప్యూటీ ఈవోను వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముగాస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

చర్యలు తీసుకోకుండా కాలయాపన

ఇక బండ్లగూడ మాస్టర్‌మైండ్స్ పరిస్థితి మరీ దారుణం. పాఠశాల ఉన్న భవంతి లోనే కింద ఓ మల్టీ క్యూసియన్ రెస్టారెంట్ ఉండడం విద్యార్థుల భద్రతను ప్రశ్నిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అదే భవంతిలో పాఠశాలను నిర్వహించడమే కాకుండా అనుమతులు లేకుండా సీబీఎస్ఈ తరగతుల నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతునారు. నగరంలో జరుతున్న అగ్నిప్రమాద ఘటనల నేపథ్యంలో ఈ పాఠశాల విద్యర్థుల భద్రతను విద్యాశాఖ అధికారులు గాలికి వదిలేశారని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ విషయమై **'ప్రతిపక్షం'** దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైనా బండ్లగూడ మండల విద్యాధికారులు చర్యలు తీసకుంటామని చెబుతూనే కాలయాపన చేస్తున్నారు.

కళ్లలో కారం కొట్టి రూ.కోటి లూటీ

- కూకట్‌పల్లిలో భారీ దారి దోపిడీ
- ముగ్గురు నిందితుల అరెస్టు.. 70 లక్షల నగదు రికవరీ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్ మార్చి 17: హైదరాబాద్ కూకట్‌పల్లిలో పెద్ద మొత్తంలో నగదు దోపిడీ జరిగింది. ద్విచక్ర వాహనంపై బాక్సులో రూ.కోటి నగదు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి గుర్తు తెలియని మరో నలుగురు ఆగంతకులు నగదు దోచుకుపోయారు. పోలీసుల వివరాల ప్రకారం, బహదూర్‌పురాకు చెందిన కుస్రు, అజీముద్దీన్ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై డబ్బు తీసుకెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. కూకట్‌పల్లి మెట్రో పిల్లర్‌నెంబర్ 836 వద్దకు చేరుకోగానే 2 బైకులపై నలుగురు దుండగులు వచ్చి వారిని అడ్డగించారు. అనంతరం వారి కళ్లలో కారం చల్లి, వారి వద్ద ఉన్న కోటి రూపాయల నగదును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం సీసీఎస్, కూకట్‌పల్లి పోలీసులు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ నగదు ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు, ఆ డబ్బు ఎవరిది, ఎవరికి ఇవ్వాల్సిందో వంటి అంశాలపై కూడా పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. మరోవైపు ఎవరి ఆదేశాలతో డబ్బులు ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేస్తున్నారనే కోణంలో విచారణ చేస్తున్నట్లు కూకట్ పల్లి ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపారు.

నిందితుల అరెస్ట్.. నగదు రికవరి

కూకట్‌పల్లి ప్రాంతంలో జరిగిన భారీ దోపిడీ కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.77 లక్షల రికవరీ చేశారు. మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరా దృశ్యాల ఆధారంగా రూ.1 కోటితో పరారైన నలుగురు దుండగుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు



ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- తహశీల్దార్‌కు మహేశ్వరం మండలం బీజేపీ నాయకులు వినతి

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 17: మహేశ్వరం మండల తహశీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, అలాగే మండల పరిధిలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో పురోగతి లేదని విమర్శించారు. మండలంలో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందక అప్పులపాలవుతున్నారని తెలిపారు. అలాగే ఆసరా పెన్షన్లు అర్హులకు అందకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే ఆమోదించి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీలో జరుగుతున్న ఆలస్యాన్ని తగ్గించి, నిర్ణీత సమయంలో జారీ చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తెల్ల మల్ల యాదిష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పొత్తర్ల సుదర్శన్ యాదవ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్, దేశ్యనాయక్, మండల ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, బి.ఉపేందర్, మోర్చా అధ్యక్షులు ఎర్ర పాండు, జి.మాధవ్, రఘువీర్, బి.భారత్, ఎం.దేవేందర్, ఎం.శివసాయినాథ్, ఎ.ప్రకాశ్, మోతె యాదయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్లాట్లు కొనే ముందు లోతుగా విచారించండి

- అన్నీ సరి చూసుకున్నాకే కొనండి
- ప్రజావాణి ఫిర్యాదుల నేపథ్యంలో అప్రమత్తం చేసిన హైడ్రా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్ మార్చి 17: ప్లాట్, ఇంటి స్థలం కొనేటప్పుడు లోతుగా విచారించి, అన్నీ సరిగా ఉంటేనే ముందుకు వెళ్లాలని హైడ్రా సూచించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏమైనా ఉన్నాయా? అనుమతి పొందిన లే ఔటా.. కాదా..? ఇంటి నంబరు చూపించి ప్లాట్లను, బై నంబర్లతో ప్లాట్లను అమ్ముతున్నప్పుడు మరింత అప్రమత్తంగా పరిశీలించి కొనుక్కోవాలని పేర్కొంది. గేటెడ్ కమ్యూనిటీ అంటూ ప్లాట్లు, విల్లాలు అమ్ముతున్నప్పుడు ఆ అనుమతులను పరిశీలించాలని కోరింది. గేటెడ్ కమ్యూనిటీ అయితే తన సొంత స్థలంలోంచి చుట్టుపక్కల కాలనీలకు కనీసం 40 అడుగుల దారి చూపించారా లేదా అనేది పరిశీలించి కొనాలంది. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా ఈ హెచ్చరికలు చేసింది. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 48 ఫిర్యాదులు రాగా వాటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. ఫిర్యాదు దారుల ముందే గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ ఇమేజీల ఆధారంగా పరిశీలించి, పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు ఉపయోగించుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 17: మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం మంగళవారం హుస్నాబాద్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ కొనుగోలు కేంద్రాన్ని మొక్కజొన్న రైతులు ఉపయోగించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుండి కనీస మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేయాలని కోరగా, వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మంగళవారం నుండి మొక్కజొన్నను కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారని తెలిపారు. ఈ మేరకు హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మీలు, బొలిశెట్టి శివయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ, మార్క్ఫెడ్ అధికారులతో కలిసి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు ప్రారంభించారని, రైతులు ఆందోళన చెందరాదని ఆ ప్రకటనలో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



నందుపల్లిలో డ్వాక్రా భవనానికి భూమి పూజ

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 17: మహేశ్వరం మండల కేంద్రంలోని నందిపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళ భవనం లేకపోవడంతో మహిళలందరూ చాలా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలలో భాగంగా గెలిచిన వెంటనే డ్వాక్రా మహిళా భవనాన్ని నిర్మిస్తానని గ్రామస్తులకు మాట ఇచ్చినట్టు సర్పంచ్ దేశపాగ నరసింహ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం ఎంజైరేగ్స్ ఫండ్ ఆధ్వర్యంలో మహేశ్వరం ఎంపిడిఓ శైలజ రెడ్డి మరియు పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ మహేశ్వరం ఏఈ రాంప్రసాద్ రెడ్డి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అనిల్ కుమార్ చేతుల మీదుగా బాణం ఏర్పాటుకు ముగ్గు పోయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ షేక్ ఎజాస్, కల్వకోల్ మహేందర్, దేశపాగ రమేష్, పంచాయతీ కార్యదర్శి జానయ్య గ్రామంలో పెద్దలు హాజరయ్యారు.



తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఉగాది పురస్కారాలు

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 17: నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికగా 'శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కార వేడుకలు' అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ చండీ పరమేశ్వరి పీఠం సౌజన్యంతో, జీఎంకె ఫౌండేషన్, ఆదిలీల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖుల సమక్షంలో పురస్కార ప్రదానం: శ్రీ చండీ పరమేశ్వరి పీఠాధిపతి, ప్రముఖ సిద్ధాంతి డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ దివ్య ఆశీస్సులతో ప్రారంభమైన ఈ వేడుకలో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణప్రసాద్, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, శాసన మండలి సభ్యురాలు (ఎమ్మెల్సీ) పోతుల సునీత, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మరియు తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి, జి.ఎమ్.కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు జి. మణికంట, మరియు ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ ఆదినారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. సమాజ సేవలో, ఆధ్యాత్మిక రంగంలో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులకు ఈ సందర్భంగా ఉగాది పురస్కారాలు, సేవా రత్న, జ్యోతిష్య మరియు ధార్మిక పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఉగాది పండుగను పురస్కరించుకుని, సేవా దృక్పథం కలిగిన వ్యక్తులను గౌరవించుకోవడం అభినందనీయమని కొనియాడారు. సమాజ హితం కోసం పాటుపడే సంస్థలకు పీఠాధిపతుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షులు పాండురంగారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు మరియు పురస్కార గ్రహీతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- పారిశుద్ధ్య నిర్వహణలో రాజీపడొద్దు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పూర్తి చేయించాలి
- ఎమ్మెల్యే కాలె యాదయ్య



ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 17: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చేవెళ్ల శాసన సభ్యులు కాలె యాదయ్య అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 15, 16వ వార్డులలో చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డిలతో కలిసి పర్యటించారు. రెండు వార్డులలో పూర్తిగా కలియ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అండర్ డ్రైనేజ్, సీసీరోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణపై తదితర సమస్యలను ఎమ్మెల్యే కాలె యాదయ్య, చైర్పర్సన్ సమతా వెంకట్ రెడ్డిల దృష్టికి ఆయా వార్డుల ప్రజలు తీసుకువచ్చారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్లు కావాలని పలువురు వారికి విన్నవించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. చేవెళ్ల అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం. అందులోను ఇటీవలే పురపాలక సంఘం ఆవిర్భవించింది. పాలకవర్గాలు సైతం ఏర్పడ్డాయి. ఇక అభివృద్ధి అన్ని రంగాల్లో పరుగులు పెట్టించాలని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ నిధులు రూ.15కోట్లతో మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో అండర్ డ్రైనేజ్, సీసీరోడ్లకు ఎన్నికలకు ముందే శంకుస్థాపనలు చేయడం జరిగిందని, సదరు పనులను వేగవంతం చేయించాలని సూచించారు. అదే విధంగా పారిశుద్ధ్య పనుల విషయంలో రాజీపడొద్దని తెలిపారు. ఎప్పటికప్పుడు తడిపొడి చెత్తను వేరుగా చేయించి, డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. అండర్ డ్రైనేజ్. తాగునీరు సమస్య ఎక్కడ ఉత్పన్నమైన పాలకవర్గం వెంటనే స్పందించాలని చెప్పారు. అర్హులైన వారికి విరివిగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మంజూరిదైన ఇళ్లను లబ్ధిదారుల చేత సకాలంలో నిర్మింపచేయాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశం. వైస్ చైర్మన్ రాములు, వార్డు కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, కృష్ణ నాయక్.దావల్ గారి గోపాల్రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం. బాల్రాజ్. మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మెన్ బ్యాగరి రాములు, పీఏసీఎస్ మాజీ చైర్మెన్లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాప్రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, నాయకులు దామోదర్ రెడ్డి, అత్తెల్లి రవిందర్ రెడ్డి, గుత్తి మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

"



ప్రస్తుతం రాష్ట్రంలో 15 రోజులకు సరిపడా ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి. అదనంగా 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ వచ్చింది. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. గ్యాస్ సిలెండర్ల డెలివరీ సమయాన్ని రోజులకు కుదించాలని అధికారులను ఆదేశించాం. ఆస్పత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు చేపట్టాలని సూచించాం.

\- ఏపీ సీఎం చంద్రబాబు



డిజిటల్ హెల్త్ కార్డుల అమలుకు సమగ్ర యాక్షన్ ప్లాన్

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జీజీహెచ్ వరకు పూర్తి ఏర్పాట్లు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 17 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న డిజిటల్ హెల్త్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడానికి డిజిటల్ హెల్త్ కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు,జిల్లా వైద్య అధికారులతో డిజిటల్ హెల్త్ కార్డు ప్రక్రియ సమర్థవంతంగా ఎలా అమలు చేయాలనే అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన ఆరోగ్య సేవలు అందించడంలో డిజిటల్ హెల్త్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి హెల్త్ ఐడి నమోదు జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రాజెక్ట్ అమలు పై అవగాహన, అవసరమైన సిబ్బంది ,పరికరాలు, ప్రాథమిక నివేదిక ను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని వైద్యాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నమోదు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు తగిన సిబ్బంది నియామకం, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, ఓపీ కేంద్రాలను సిద్ధం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఎం వసంతరావు , వైద్యాధికారులు డాక్టర్ శశాంక్, డాక్టర్ నాగ నిర్మల ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సమర్థవంతంగా అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 17 : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని బస్తీ దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, శెట్కార్ గ్రౌండ్స్ మరియు ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులు మరియు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఓపీకి వచ్చే రోగుల వివరాలపై ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారా అన్న విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ గదిలో మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆసుపత్రినీ , పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం నారాయణఖేడ్ లోని శెట్కార్ గ్రౌండ్స్‌ను సందర్శించి పరిశీలించారు. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మరియు అవసరమైన మరమ్మత్తులకు అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. స్టేడియం వినియోగానికి డైలీ రెంట్‌ను నిర్ణయించాలని, స్టేడియం పరిధిలో ఉన్న షాపుల రెంట్ బకాయిలను వసూలు చేయాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డికి ఆదేశించారు. తదనంతరం ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని సందర్శించి పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న రూఫ్ లీకేజీ, డ్రైనేజీ తదితర మరమ్మత్తులకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఈడబ్ల్యూఐడీసీ ఏఈకి ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ఉమా హారతి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్‌నాయక్, తహసిల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.





గ్రామ అభివృద్ధిలో నేను సైతం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 17: మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ గ్రామ పంచాయతీ పాలకవర్గంతో నర్సరీని సందర్శించారు. అక్కడికి వెళ్లి చూడగా చాలా చెట్లు కొమ్మలు ఉండడంతో స్వయంగా తానే గొడ్డలి తీసుకొని చెట్లు కొమ్మలు తొలగించారు. తనతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రతి ఒక్కరు పాల్గొని గ్రామపంచాయతీలో పండ్ల చెట్లను పూల మొక్కలను పెంచాలని, నర్సరీని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తో పాటు ఉపసర్పంచ్ మహేందర్, ఎం రవి ఎం మోహన్, ఎం లావణ్య, పంచాయతీ కార్యదర్శి నవీన్ యాదవ్, ఎం శ్రీను, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కాసువాగు భూములపై కేఎల్ఆర్ కు రైతుల ఫిర్యాదు

- అక్రమ ప్రహారి నిర్మాణాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి
- నాడు ఇందిరమ్మ ఇచ్చిన సీలింగ్ భూముల్లో ప్రైవేటు పెత్తనం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 17: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ మండలం బడంగ్ పేట డివిజన్ నాదర్ గుల్ గ్రామం సర్వే నంబర్ 613లో 373 ఎకరాలను ఓ ప్రైవేటు సంస్థ అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారని రైతులు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కేఎల్ఆర్ ... రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. కాసువాగు రైతులకు న్యాయం చేయాలని కోరారు. తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కే. లక్ష్మారెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు రైతులు. అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడలను తొలగించాలని... అవసరమైతే పోలీస్ బలగాల సహాయం తీసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. గత కొన్నేళ్లుగా కాసువాగు రైతులు ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఇబ్బందులు పడుతున్నామని కిచ్చెన్న దృష్టికి తెచ్చారు. ఇందిరమ్మ పాలనలో సీలింగ్ భూములను పేదలు, బడుగు, బలహీన వర్గాలకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పేదలకు తప్పకుండా న్యాయం చేస్తామని... కాసువాగు రైతులు ధైర్యంగా ఉండాలని లక్ష్మారెడ్డి కిచ్చెన్నగారు సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం నాదర్ గుల్, బడంగ్ పేట డివిజన్ల కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



బేటీ జన్మోత్సవ కార్యక్రమం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17 : సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, మహిళా సాధికారత కేంద్రం సహకారంతో బేటీ జన్మోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆసుపత్రిలో పుట్టిన ఆడ శిశువులను గౌరవిస్తూ బేటీ జన్మోత్సవ కిట్లు మరియు ప్రశంసాపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీడబ్ల్యూఓ మరియు డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ఆడపిల్లలు మరియు మగపిల్లలను సమానంగా చూడాల్సిన అవసరాన్ని వివరించారు. సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెంపొందించాల్సిన అవసరాన్ని, బాలికల విద్య, ఆరోగ్యం మరియు భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. అలాగే పుట్టిన శిశువులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించి, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లి పాలనే ఇవ్వాలని అవగాహన కల్పించారు. అదనంగా, అవసరమైన సందర్భాల్లో మహిళా సాధికారత కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బాలికల హక్కుల పరిరక్షణ, పోషణ మరియు విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ నాగనిర్మల ,మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి , ఆసుపత్రి సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. అదే విధంగా పటాన్ చెరు ఏరియా ఆస్పత్రిలో ఈ కిట్స్ అందించడం జరిగింది.



నీటి సమస్య పరిష్కరించిన నూతన పాలకవర్గం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 17: మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో 8వ వార్డులో నీటి సమస్య చాలా రోజుల నుండి ఉన్నది ఆ సమస్య గెలిచిన వెంటనే తీరుస్తాం అని ఎన్నికలో భాగంగా మాట ఇచ్చారు. ఈ మేరకు బుధవారం గ్రామ సర్పంచ్ బండారి లింగం చేతుల మీదుగా ఓపెనింగ్ చేశారు. 8వ వార్డు సభ్యులు రాణమ్మ కుమారుడు బూరుల నవీన్ కుమార్ మాట్లాడుతూ... గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల సహకారంతో వార్డులో బోర్ వేసి ప్రజలకు నీరు అందించినట్టుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు.. పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, వార్డు మెంబర్లు కోర్ర రవి, తో పాటు కృపానందం, శరత్ రెడ్డి, తోట్ల నరసింహ బాలరాజ్, గ్రామ ప్రజలు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని బూర్గుల నవీన్ కుమార్ తెలియజేశారు.



భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 17: మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్ 95వ వర్థంతి సందర్భంగా నిర్వహించనున్న స్మారక యువజనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో, మండల కార్యదర్శి చరణ్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ .....నాయకులు విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య సమరంలో వారు చూపిన త్యాగం, ధైర్యం యువతకు ఎప్పటికీ మార్గదర్శకమని తెలిపారు. సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం కోసం పోరాడిన భగత్ సింగ్ ఆలోచనలు ప్రస్తుత కాలంలో మరింత ప్రాసంగికంగా మారాయని అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా రంగంపై దాడులు, ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో యువత చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి సమస్యల నుంచి యువత దూరంగా ఉండాలని, వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, యువజన ర్యాలీలు, డ్రగ్స్ మరియు బెట్టింగ్ యాప్స్ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శులు, నాయకులు మాల చందు, చరణ్, నితీష్, అరుణ్, రోషన్ తదితరులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ముస్లిం పోలీసు సిబ్బందికి ఇఫ్తార్ విందు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17 : ముస్లింలా పవిత్ర మాసం రంజాన్ అని, రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో, నిష్టగా ఉపవాస దీక్ష చేస్తారని ఎస్పీ అన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొమ్మిదవ నెల అయిన పవిత్ర రంజాన్ మాసంలో రోజు వారీ ఉపవాసాన్ని ముగించడానికి, సూర్యాస్తమయం తర్వాత మగ్రిబ్ ప్రార్థన అనంతరం తీసుకునే పండ్లు, ఫలహారం భోజనమే ఇఫ్తార్ అని తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం రోజు జిల్లా పోలీసు మోటర్ వెహికల్ సెక్షన్ నందు జిల్లా పోలీసులకు 'దావత్‌ఇఇఫ్తార్'ను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ విందులో జిల్లా పోలీసు అధికారులతో పాటు ముస్లిం సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని, ఉపవాస దీక్ష ను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావ్, డిఎస్పీ సత్యయ్య గౌడ్, ప్రభాకర్, సురేందర్ రెడ్డి, ఎఆర్ డిఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్ రమేష్, రాము నాయుడు, రామకృష్ణ రెడ్డి, క్రాంతి కుమార్, ఆర్ఐలు రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస్ రావ్, ముస్లిం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






ఆలయంలో చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్ట్

- 6.2 తులాల బంగారం, 8 కేజీల వెండి, రూ.2.10 లక్షల నగదు స్వాధీనం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17 : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్‌లో గల శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం రామచంద్రపురం ఏసీపీ శ్రీనివాస్ కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, సాయికుమార్ అనే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరు గతంలో కూడా పలు దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన పాత నేరస్థులుగా పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుండి భారీ మొత్తంలో చోరీ సొత్తును పోలీసులు రికవరీ చేశారు. 6.2 తులాల బంగారం, 8 కేజీల వెండి వస్తువులు, రూ.2.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను, భక్తులను భయాందోళనకు గురిచేస్తున్న ఇలాంటి నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులపై పీడీ యాక్ట్ పెట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆలయాల్లో భద్రత విషయంలో నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలని, సీసీ కెమెరాల నిఘా పెంచుకోవాలని పోలీసులు ఈ సందర్భంగా సూచించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కృషి చేయాలి

- ఆరోగ్య బీమా పథకాలను విస్తరించాలి
- వృత్తి భద్రతకు చర్యలు తీసుకోవాలి
- టీయూడబ్ల్యూజే సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి.



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17 : వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కృషి చేయాలని, దీనికి సంబంధించిన పథకాలను మరిన్ని అమలు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టియు డబ్ల్యూజెజేయు) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి కోరారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో మంగళవారం నాడు వార్త ల్యాబ్ వర్క్ షాప్ ను నిర్వహించారు. ఇలాంటి వర్క్ షాపులు జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వృత్తికి సంబంధించిన అనేక విషయాలు నేర్చుకోవచ్చునని అన్నారు. మారుతున్న కాలానికి తగిన విధంగా సాంకేతిక నైపుణ్యాన్ని కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలంలో జర్నలిజంలో అనేక మార్పులు వస్తున్నాయని, వాటికి తగిన విధంగా జర్నలిస్టులము కూడా మారుతున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు వర్క్ షాపుల ద్వారా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో వారి సంక్షేమం పట్ల కూడా ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఉద్యోగ భద్రత పై దృష్టి సారించాలని కోరారు. అంతేకాకుండా జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భీమా విషయంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వార్తలను కవర్ చేస్తున్న సందర్భంలో ప్రమాదాలను లెక్కచేయకుండా జర్నలిస్టులు పరుగెడుతున్నారని చెప్పారు. చివరకు తమ కుటుంబాన్ని, ఎంతో విలువైన జీవితాన్ని కూడా లెక్కచేయకుండా వృత్తినిబద్ధతకు కట్టుబడి ఉంటున్నారని అన్నారు. ఈ క్రమంలోనే అనేకమంది తీవ్ర గాయాల పాలవుతున్నారని, దుర్మరణం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సందర్భాలలో జర్నలిస్టుల కుటుంబాలకు తీరని నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. అందువల్ల ప్రమాద బీమా ఉన్నట్లయితే ఆయా కుటుంబాలకు ఎంతో కొంత ఆసరా కలుగుతుందని చెప్పారు. ఈ విషయంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో తగిన విధంగా స్పందించాలని కోరారు. జర్నలిస్టుల భద్రతకు సంబంధించిన చర్యలను తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కేంద్ర అధికారులకు రాష్ట్ర అధికారులు నివేదించాల్సిందిగా యాదగిరి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మరిన్ని వర్క్ షాప్ లను ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్యాన్ని గ్రామీణ స్థాయి వరకు విస్తరించాల్సిందిగా కోరారు. దీనికి పి ఐ బి అదనపు డీజీ శృతి పాటిల్ సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి వెలిగించి వర్క్ షాపును ప్రారంభించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు,గ్రామీణ జర్నలిస్టులు పాల్గొన్నారు.



బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి గతం కంటే ఈసారి సీట్లు తగ్గుతాయి. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఆటలాడినా ఆ పార్టీకి రాష్ట్రంలో ఏ మాత్రం గెలిచే అవకాశం లేదు. ఈ ఎన్నికల్లో 'బెంగాల్' గెలుస్తుంది. మా రాష్ట్రంలో 'ఢిల్లీ కా లడ్డూ' పని చేయదు.

- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

ప్రాంతీయం




సీఎం పర్యటనలో పొరపాట్లు జరగకూడదు

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 17: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా వివిధ శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి, విజయ ఎండీ చంద్రశేఖరరెడ్డితో కలిసి నంగునూరు మండలం నర్మెట లోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి ఫ్యాక్టరీ ప్రారంభించడానికి అవసరమైన హెలిప్యాడ్ ఏర్పాటు, బహిరంగ సభ వేదిక ఏర్పాటు, రైతు మేళాకు స్టాళ్ల ఏర్పాటు, ఫ్యాక్టరీలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెలిపాడ్ ఏర్పాటు, బహిరంగ సభ, ఫ్యాక్టరీ ప్రారంభం, స్టాళ్లు, శిలాఫలకం ఆవిష్కరణ తదతర అన్ని కార్యక్రమాలు ప్రోటోకాల్ ప్రకారం ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, మరుగు దొడ్లు తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అధికారులు సూచించిన విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ ఉపయోగపడే గొప్ప కార్యక్రమం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవమన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభంతోపాటు రైతు మేళాకు వచ్చే వేలమంది రైతులు ఆయిల్ ఫామ్ తోటల పెంపకం పొందే ప్రయోజనాలను, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ, పశువుల పెంపకం వలన కలిగే ప్రయోజనాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉన్నందున సంబంధిత అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, వ్యవసాయ, ఆర్టికల్చర్, ఆర్ అండ్ బీ, పోలీస్, ఆయిల్ ఫెడ్, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం హామీలు వెంటనే నెరవేర్చాలి

- ఎంఆర్ఓకు వినతి పత్రం సమర్పించిన బీజేపీ నాయకులు

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 17: రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చని హామీలను వెంటనే నెరవేర్చాలని , దుబ్బాక మున్సిపల్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దుబ్బాక బి జె పి మున్సిపల్ అధ్యక్షులు దోరగొల్ల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో దుబ్బాక ఎం ఆర్ ఓ కు భారతీయ జనతా పార్టీ తరపున వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయడం లేదని 6 గ్యారంటీలు ,420 హామీలు వెంటనే అమలు చేయాలని, లేకపోతే బి జె పి ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి జె పి కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు సత్తు.తిరుమలరెడ్డి , సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబర్ పుట్ట వంశి , దిశ బోర్డ్ మెంబర్ సుంకోజు ప్రవీణ్ కుమార్ , బీజేపీ కౌన్సిలర్లు గంభీర్పూర్ కనకరాజు,మెరుపుల. సాయి కుమార్ గౌడ్, జిల్లా నాయకులు గాజులభాస్కర్, ఒగ్గుతిరుపతి, మున్సిపల్ నాయకులు పెంటం కిషన్, ఇస్తారిగల్ల యాదగిరి, రాజు కాక, పెంటంమహేష్ తదితరులు పాల్గొన్నారు.

సిధారెడ్డికి సాహిత్య అకాడమీ అవార్డు.. తెలంగాణకు గర్వకారణం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 17: ప్రఖ్యాత రచయిత, కవి, విమర్శకుడు నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం పట్ల రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ (RUPPT) నాయకులు హర్షం వ్యక్తం చేశారు.కరోనా సమయంలో ఉద్భవించిన సామాజిక అంశాల నేపథ్యంలో సిధారెడ్డి రచించిన 'అనిమేష' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించడం తెలంగాణకు గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ... "సిధారెడ్డి తెలంగాణ భాషా సాహిత్యాలకు చేసిన సేవలు అమోఘం. ఆయనకు లభించిన ఈ అవార్డు రాష్ట్ర సాహిత్య కీర్తిని దేశవ్యాప్తంగా చాటిచెబుతుంది" అని అన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ మాట్లాడుతూ... "తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడిగా ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. 'అనిమేష' వంటి కావ్యం ద్వారా సమాజ సమస్యలను ప్రతిబింబించడం గొప్ప విషయం" అని పేర్కొన్నారు.కోశాధికారి నాగుల భిక్షపతి మాట్లాడుతూ... "ఈ అవార్డు ద్వారా తెలంగాణ రచయితలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. సిధారెడ్డి విజయం అందరికీ స్ఫూర్తిదాయకం" అన్నారు.రాష్ట్ర సహాధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... "తెలంగాణ భాషా వైభవాన్ని దేశానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి సిధారెడ్డి. ఆయనకు లభించిన ఈ గౌరవం ప్రతి తెలంగాణ వాసికి గర్వకారణం" అని తెలిపారు.ఈ సందర్భంగా సంఘం తరఫున సిధారెడ్డి కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



శంకరంపేట్ (ఆర్) పోలీస్ స్టేషన్‌ను
ఆస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

ప్రతిపక్షం, ప్రతినిధి, మెదక్, మార్చి 17: మెదక్ జిల్లా శంకరంపేట్ (ఆర్) పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, వివిధ కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కేసులపై నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఉన్న కేడీలు, అనుమానితులు, రౌడీషీటర్లపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించి నిఘా కట్టుదిట్టం చేయాలని తెలిపారు. ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిరంతరం సమీక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.అలాగే సైబర్ నేరాల నివారణకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట్ సీఐ వెంకటరాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల బస్సు ఢీకొని ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ప్రతిపక్షం, గజ్వేల్ (జగదేపూర్), మార్చి 17: మోటార్ సైకిల్ పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వచ్చిన పాఠశాల బస్ ఢీ కొంది. దీంతో ఒక్కరి మృతి చందగా, మరొకరి పరిస్థితి విషమం గా ఉన్నట్లు జగదేవ్పూర్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్ పూర్ కి చెందిన ఆలకుంట రమేష్(48), మల్లయ్య (70) లు తమ సొంత పనులపై మండల కేంద్రానికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న పాఠశాల బస్సు ఢీకొన్నది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చందగా క్షతగాత్రుడైన మల్లయ్యను గజ్వేల్ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.



సమాజ శ్రేయస్సుకు రక్షకుల ఆరోగ్యం ముఖ్యం

- హాస్పిటల్ సూపరిండెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఏసిపి నరసింహులు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 17: గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళవారం పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "99 రోజుల కార్యాచరణలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అన్నపూర్ణ, గజ్వేల్ ఏసిపి నరసింహులు మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా, సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు, ప్రజల రక్షణ సాధ్యమవుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పోలీసులకు రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



1,175 ఎకరాలలో మొక్కజొన్న పంట నష్టం

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 17: సోమవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి నంగునూరు మండలంలో 1175 ఎకరాల మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి బి.గీత తెలిపారు. ప్రాథమికంగా వేసిన అంచనా వివరాలను ఉన్నతాధికారులకు పంపామన్నారు. అక్కెనపల్లిలో 350 ఎకరాలు, గట్లమల్యాలలో 800 ఎకరాలు,ఖాతాలో తొమ్మిది ఎకరాలు కొండంరాజపల్లిలో ఎనిమిది ఎకరాలు, నంగునూరులో ఒక ఎకరం,పాలమాకులలో రెండు ఎకరాలు, నర్మెటలో ఒక ఎకరం మగ్దుంపూర్ లో రెండు ఎకరాలలో మొక్కజొన్న పంట దెబ్బ తిన్నదని వివరించారు.



భద్రాద్రి రాముల కళ్యాణానికి
గోటితో ఒలిచిన వడ్లు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 17: శ్రీరామనవమి నాడు కన్నుల పండుగగా జరిగే భద్రాచలం సీతారాములకు గోటి తలంబ్రాలు అందించాలని భక్తులు భక్తి శ్రద్దలతో, ఉపవాస దీక్షతో మండలంలోనిఅన్ని గ్రామాలలో, కాలనీలలో గోటితో వడ్లు ఒలిచి సిద్ధం చేసి రామకోటి సంస్థకు అందిస్తున్నారు. మంగళవారం నాడు గజ్వేల్ లో మహిళలు భద్రాచలం నుండి వచ్చిన గోటి తలంబ్రాలకు ప్రత్యేక పూజలు చేసి భక్తితో ఒలిచి అందించారు.



కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు..
రాష్ట్ర ప్రజలకు తిప్పలు

- గజ్వేల్ బీజేపీ నాయకులు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 17: ఆరు గ్యారంటీలు 420 హామీల పేరుతో రాష్ట్ర ప్రజలను నయవంచనకు గురిచేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు హామీల అమలులో దాటవేసే ధోరణికి నిరసనగా మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్, మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ లు స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసి అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా కౌలు రైతులకు ఎకరానికి 15 వేలు, వ్యవసాయ కూలీలకు 12 వేలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, మహిళలకు ప్రతినెల 2500, విద్యార్థులకు 5 లక్షల విద్య భరోసా, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్, ఇందిరమ్మ ఇళ్లు, 4 వేల నెలవారి పెన్షన్లు, ఫీజు రీయింబర్స్మెంట్, రుణమాఫీ, రైతు భరోసా, వంటి హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తుందన్నారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి వృద్ధాప్య వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు కల్యాణ లక్ష్మి పేదలకు గృహ నిర్మాణ పథకం భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు అటకెక్కాయి అన్నారు. కాంగ్రెస్ మీద నమ్మకంతో ఓటు వేసిన ప్రజలను నయవంచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వానికి మిగిలి ఉన్న 999 రోజులూ వారి వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన బిజెపి అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, దాతర్ పల్లి సర్పంచ్ బాసు రాజు, ఉప సర్పంచ్ బారు అరవింద్, మన్నె శేఖర్, చెప్యాల వెంకట్ రెడ్డి, నాయిని సందీప్ కుమార్,మన్నెం శశిధర్ రెడ్డి ,నాగు ముదిరాజ్, తలారి రాజు, పేర్ల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, సల్ల శ్రీనివాస్, శ్రీరామ్ కృష్ణ, కాశమైన సందీప్ కుమార్, కోల్పుల హనుమంత్, శ్రీనివాస్ చారి, సిలువేరు కుంకుమ రాణి, భక్త మాల,అన్నపూర్ణ, కాళ్ళ సాయి, ఎల్ల మధు, ఎల్ల బాబు, శ్రీనివాస్, పవణ్ కుమార్,పేర్ల శ్రీనివాస్, జోడు ప్రకాశ్,గోపాల్, దయాకర్ రెడ్డి, పిట్ల శ్రీనివాస్, వంజరి రాజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ మాసం త్యాగం, సేవాభావానికి ప్రతీక

- ఆత్మీయ మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



ప్రతిపక్షం, ప్రతినిధి, మెదక్ మార్చ్ 17: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే మైనార్టీ సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయతకు, పరస్పర ప్రేమాభిమానాలకు, మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మంగళవారం పాపన్నపేట మండల కేంద్రంలోని మంజీరా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులోముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా ముస్లిం సోదరులు సామూహిక నమాజ్ నిర్వహించారు. అనంతరం రోజంతా ఉపవాస దీక్షలో ఉన్న మైనార్టీ సోదరులకు ఎమ్మెల్యే రోహిత్ రావు స్వయంగా ఫలహారాలు అందించి ఉపవాసం విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం త్యాగానికి, సేవా భావానికి, దానధర్మాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్ష మనిషిలో క్రమశిక్షణ, సహనం, పరస్పర సహకారం వంటి విలువలను పెంపొందిస్తుందని అన్నారు.అన్ని మతాలు మానవత్వం, శాంతి, ప్రేమ, సహనం వంటి విలువలను బోధిస్తాయని ఆయన తెలిపారు. సమాజంలో మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రజలంతా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాలన్నారు. పండుగలు మనుషులను దగ్గర చేసే గొప్ప సంప్రదాయాలని, ఇఫ్తార్ విందులు అందుకు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు.మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,ఉప సర్పంచ్ సద్దాం,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్,మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్,హుసేన్, వార్డు సభ్యులు,మైనార్టీ నాయకులు, స్థానిక నాయకులు,పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

"



అనవసర చర్చల్లోకి మహిళా యాక్టర్లను లాగుతున్నారు. ఇతరులను విమర్శించేందుకు ఓ మహిళ ఐడెంటిటీని వాడుకోవడం కరెక్ట్ కాదు. ప్రతి మగాడు జన్మించేది స్త్రీకే. మీ ఇంట్లో మహిళల గురించి ఇలాగే మాట్లాడతారా? మహిళా యాక్టర్లు పబ్లిక్ ఫిగర్లు కావచ్చేమో కానీ పబ్లిక్ ప్రాపర్టీలు కాదు.
- బీజేపీ నేత, నటి ఖుష్బూ సుందర్

ప్రాంతీయం

ఈనెల 20వ తేదీ నుంచి రైతు మహోత్సవం

- 22వ తేదీన రైతు భరోసా నిధుల విడుదల
- రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 17: నర్మెటలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ వద్ద ఈ నెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు వ్యవసాయ,మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతు మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులు, రైతు ఉత్పత్తి సంస్థలు, స్టార్టప్‌లు, ప్రైవేట్ కంపెనీల ప్రదర్శనలు వీటిలో ఉంటాయని చెప్పారు. అధికారులు, శాస్త్రవేత్తలతో రైతులకు ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 22వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం ఆయిల్ ఫామ్ రిఫైనరీకి శంకు స్థాపన చేస్తారని తెలిపారు. ఇక్కడి నుంచే రైతు భరోసా నిధుల విడుదల చేస్తారని పేర్కొన్నారు. రైతు మహోత్సవంలో వేడుకలో ప్రజాప్రతినిధులు, ఆదర్శ రైతులు, రైతు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు

- వాహనాలు జాగ్రత్తగా నడపాలి
- రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి
- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 17: నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా శంకరంపేట్ ఆర్ మండలంలోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు వెంకట రాజా గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నారాయణ గౌడ్, ఎంఎస్ఎన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మీయ, దాతృత్వానికి ప్రతీక రంజాన్

- దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 17: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని బల్వంతపూర్ గ్రామంలో నిరుపేద ముస్లిం సోదర, సోదరీమణులకు సహాయంగా దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి ఆధ్వర్యంలో 'రంజాన్ తోఫా' నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఏ ఎం సి చైర్మన్ కొంగరి రవి మాట్లాడుతూ రంజాన్ పండుగ ఆత్మీయత, సహకారం, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సహాయం చేయడం తమ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, నాయకులు సౌడు స్వామి, మహమ్మద్ నజీర్, వార్డ్ మెంబర్ షాదుల్, భాను, స్వామి పాల్గొన్నారు.



సిద్దిపేటలో చిర్రగోనె టోర్నమెంట్ ప్రారంభం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 17: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పత్తి మార్కెట్ యార్డు ప్రాంగణంలో పస్తం సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిర్రగోనె క్రీడా టోర్నమెంట్ ను సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో ఆడే అత్యంత ప్రాచీనమైన ,ప్రజాదరణ పొందిన ఆట చిర్రగోనె అని తెలిపారు. ఈ పురాతన క్రీడను "ఎస్ స్టిక్ ప్లే" పేరుతో ఆధునిక రూపంలో ముందుకు తీసుకు రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం యువతతో కలిసి కొంత సేపు ఆటలో పాల్గొన్నారు.ఆటల సమయంలో క్రీడాకారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 50 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, పస్తం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగులో కొత్త రైతులకు రైతు భరోసా

- ఏఈఓ విజృంభన



ప్రతిపక్షం, చేగుంట, మార్చి 17: రబీ సీజన్ సాగులో కొత్తగా భూములు పట్టాలు చేసుకున్న రైతులకు రైతు భరోసా వర్తిస్తుందని నార్సింగి మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి విజృంభన పేర్కొన్నారు. ఫిబ్రవరి, 28, 2026 సంవత్సరంలో భూ భారతిలో పట్టాలు పొందిన రైతులు వ్యవసాయ అధికారులకు తమ జిరాక్స్ సర్టిఫికెట్లను అందజేయాలని ఆమె పిలుపునిచ్చారు. సెక్టార్ పరిధిలోని వివిధ రకాల పంటలను విజృంభన పరిశీలించారు. నూతనంగా పట్టాలు పొందిన రైతులు పట్టాదారు పాసుబుక్ లేదా తహసిల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పొందిన జిరాక్స్ కాపీలను ఆధార్ కార్డు జత చేసి అందించాలని విజృంభన సూచించారు. కొత్త రైతులందరూ జిరాక్స్ కాపీలను ఈనెల 18వ తేదీలోపు నార్సింగ్ మండల విస్తీర్ణ అధికారులకు అందజేయాలని కోరారు.





రాలిన మామిడి పిందెలు.. వాలిన మొక్కజొన్న

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 17: ప్రకృతి ప్రకోపం అన్నదాతలకు శాపంగా మారుతోంది. ఈదురు గాలులు పంటలకు తీరని నష్టం కలిగించాయి. నంగునూరు మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులు వీచాయి. కొన్ని గ్రామాలలో ఈదురుగాలులతో పాటు వర్షం కురిసింది. అత్యంత వేగంగా వీచిన ఈ గాలులతో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. మొక్కజొన్న పంట నేల వాలింది. మామిడి తోటల్లో మామిడి పిందెలు రాలిపోయాయి. మరో 15 రోజుల్లో చేతికి రావాల్సిన మొక్కజొన్న నేల వాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పంట మార్పిడిలో భాగంగా మొక్కజొన్న సాగు చేస్తే ప్రకృతి కన్నెర్ర చేసిందని బాధ పడుతున్నారు. కంకులు ఎదిగే దశలో మొక్కలు ఒరిగి పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని సిద్ధన్నపేట,నంగునూరు, మగ్దుంపూర్ రాంపూర్, అంక్షాపూర్, నాగరాజుపల్లి, నర్మెట, మైసంపల్లి, ఖానాపూర్, ఖాతా, కొండంరాజుపల్లి, ఘనపురం, అక్కెనపల్లి, గట్లమల్యాల, సంతోష్‌నగర్, బద్దిపడగ గ్రామాలలో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేల రాలిన మామిడి పిందెలు

ఈదురు గాలులతో మామిడి తోటల్లో కొమ్మలు విరిగాయి. తోటల్లో పిందె దశ నుంచి పిక్క కట్టే దశలో ఉన్న మామిడి కాయలు ఆకులతో సహా రాలిపడ్డాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం మామిడి తోటల్లో చెట్టు నిండా పూత వచ్చింది. ఆకులు కనిపించకుండా వచ్చిన ఈ పూతతో ఈ ఏడు అధిక దిగుబడి వస్తుందని మామిడి రైతులు ఆనందించారు. ఈ తరుణంలో ఫిబ్రవరి మొదటి, చివరి వారంలో, ఈ నెల మొదటి వారంలో ప్రతి రోజూ పొగ మంచు కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు దారి కన్పించకుండా మంచు కురిసింది. మామిడి తోటల్లో పూత, కాత దశలలో మంచు అధిక నష్టాన్ని కలిగించింది. పూత రాలిపోయింది. దట్టమైన పొగమంచు తక్కువ ఉష్ణోగ్రతల వల్ల మామిడి పూత నల్లగా మారి రాలిపోయింది. మిగిలి ఉన్న పూత పిందె కట్టే ప్రక్రియను ఆలస్యం చేసింది. గాలిలో తేమ శాతం పెరిగి పూతపై తెల్లటి బూడిద వంటి పొర ఏర్పడింది. దీని వల్ల పూత ఎండిపోయి, లేత పిందెలు విపరీతంగా రాలిపోయాయి. మబ్బులతో కూడిన వాతావరణం, మంచు వల్ల తేనె మంచు పురుగు ఉధృతి పెరిగింది. పూతలో రసాన్ని పీల్చింది. దీంతో పూత ఎండి పోయి, విసర్జించిన జిగురు వల్ల 'మసి తెగులు' వ్యాపించింది. మంచుతో చలి వల్ల తేనెటీగలు వంటి మేలు చేసే కీటకాల కదలికలు తగ్గి, పరాగ సంపర్కం జరగక పిందె కాత పట్టలేదు. దీంతో రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి సస్యరక్షణ చేపట్టడంతో సగం పూత మాత్రమే నిలిచి పిందె పట్టింది. సోమవారం రాత్రి నంగునూరు మండలంలోని సిద్ధన్నపేట,నంగునూరు, మగ్దుంపూర్ రాంపూర్, అంక్షాపూర్, నాగరాజుపల్లి, నర్మెట, మైసంపల్లి, ఖానాపూర్, ఖాతా, కొండంరాజుపల్లి, ఘనపురం, అక్కెనపల్లి, గట్లమల్యాల, సంతోష్ నగర్, బద్దిపడగ, దర్గపల్లి, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, ముండ్రాయి, వెంకటాపూర్, పాలమాకుల, రాజగోపాలపేట, అప్పలాయ చెరువు, భాషగూడెం తదితర గ్రామాలలో వీచిన ఈదురు గాలులకు మామిడి తోటల్లో పిందెలు రాలిపడ్డాయి. రాలిన మామిడి పిందెలను చూసి రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

మొక్కజొన్న పరిశీలించిన వ్యవసాయ అధికారులు

ఈదురు గాలితో వాన బీభత్సానికి గట్లమల్యాల గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఏ డి ఏ పద్మ, మండల వ్యవసాయ అధికారి గీత, వ్యవసాయ విస్తరణ అధికారి బాపురాజు తదితరులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. తమను ఆదుకోవాలని రైతులు అధికారులను వేడుకున్నారు. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు.



తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 17: తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు ఇంట్లోని బీరువాను పగలగొట్టి దానిలో ఉన్న నగదును ఎత్తుకెళ్లిన ఘటన దుబ్బాక మున్సిపాలిటీ లోని లచ్చపేట 11వ వార్డులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం... లచ్చపేటకు చెందిన ఎండి. ఖాసింబి అనే మహిళ తన కుమారుని కుటుంబంతో కలిసి బీడీలు చుడుతూ, జీవనం కొనసాగిస్తోంది. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం ఒక ఇంటికి తాళం వేసి, పక్కనే ఉన్న కుమారుడి ఇంట్లో నిద్రించేందుకు వెళ్ళింది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని దొంగలు ఇంటి లోపల ఉన్న బీరువాను తెరచి, లాకర్‌ను పగలగొట్టి దానిలో ఉన్న రూ.30వేల నగదును ఎత్తుకెళ్లారు.ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో, లోపలికి వెళ్లి చూడగా, బీరువా తెరిచి ఉండడంతో దానిలో ఉన్న రూ.30వేల నగదును దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు.వెంటనే కుటుంబ సభ్యులు దుబ్బాక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సమాచారం అందుకున్న దుబ్బాక సీఐ రాజేష్, ఎస్ఐ కీర్తిరాజు క్లూస్ టీంతో కలిసి ఆధారాలు సేకరించారు. అనంతరం బాధితురాలు ఖాసింబి ఇచ్చిన ఫిర్యాదుతో దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.

సిద్దిపేటపై ఎందుకింత కక్ష

- అభివృద్ధి నిధులపై వివాదం
- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 17: సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి నిధుల అంశంపై రాజకీయంగా ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.లేఖలో సిద్దిపేట అభివృద్ధిపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు ₹1,070 కోట్ల నిధులు మంజూరై వివిధ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేయడంతో పనులు 27 నెలలుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో వెటర్నరీ కళాశాల, రంగనాయకసాగర్ టూరిజం ప్రాజెక్టు, ఔటర్ రింగ్ రోడ్, అగ్రికల్చర్ కాలేజీ, మహిళా డిగ్రీ కళాశాల భవనం, స్పోర్ట్స్ హబ్, పోలీస్ స్టేషన్ భవనాలు, పలు రహదారి అభివృద్ధి పనులు, మల్టీపర్పస్ ఆడిటోరియం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి ప్రాజెక్టులు నిలిచిపోయినట్లు లేఖలో వివరించారు. ముఖ్యమంత్రి సిద్దిపేట పర్యటనకు ముందు రద్దు చేసిన నిధులను పునరుద్ధరించి, ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 22న సిద్దిపేటకు రానున్న నేపథ్యంలో ఈ లేఖ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

మెదక్ జిల్లా కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్

మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చ్ 17: మెదక్ జిల్లా కోర్టులో మొదటి స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్,రెండవ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయమూర్తి నీలిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో లేదా రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు లేదా రాజీనామా చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు.ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 31032026గా నిర్ణయించారు. మరిన్ని వివరాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు మెదక్ జిల్లా కోర్టులో ఉన్న నోటీస్ బోర్డును పరిశీలించాలని తెలిపారు.

సీఎం హెలిపాడ్ కోసం తాటి చెట్లు నరకడం సరికాదు

- గీత కార్మికుల పొట్ట కొడితే ఊరుకోం

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 17: సీఎం రేవంత్ రెడ్డి పర్యటన కోసం గీత కార్మికులకు ఉపాధి ఇచ్చే తాటి చెట్లను తొలగించడం వారి పొట్టకొట్టడమేనని బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, నంగునూరు ప్రాథమిక వ్యవసాయ శాఖ సహకార సంఘం మాజీ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ అన్నారు. నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 22 వ తేదీన ఇక్కడకు వస్తున్న సందర్భంగా ఫ్యాక్టరీ చుట్టు పక్కల ఉన్న తాటి చెట్లను కొట్టివేస్తున్నారని చెప్పారు. తాటి చెట్లను కొట్టివేసి గీతా కార్మికుల పొట్ట కొట్టడం సబబు కాదని తెలిపారు. మంగళవారం నర్మెట గీతా కార్మికులతో కలిసి తాటి చెట్ల తొలగింపును అడ్డుకున్నారు. గ్రామంలో ఏర్పాటయిన ఫ్యాక్టరీ వల్ల దాని చుట్టు పక్కల ఉన్న తాటి చెట్లతో గీతా కార్మికులకు ఉపాధి పెరుగుతుందని కార్మికులు ఆశించారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ (ఛాపర్) దిగడానికి అవసరమైన హెలిప్యాడ్ ఏర్పాటు కోసం గీతా కార్మికులకు ఉపాధి నిచ్చే తాటి చెట్లను నరికివేయవద్దని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో తాటి ఈత మొక్కలు నాటి గీతా కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషిచేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని నాటిన పాపాన పోలేదని మండిపడ్డారు. సీఎం హెలిప్యాడ్ దిగేందుకు అనువైన ప్రాంతం ఫ్యాక్టరీ వెనక భాగంలో ఉందని చెప్పారు. అయినప్పటికీ ఫ్యాక్టరీ పక్కన ఉన్న రైతుల పొలాల్లోని తాటి చెట్లను తొలగించాలని అధికారులు ప్రయత్నాలు చేయడం తగదన్నారు.



గ్రామంలో సుమారుగా 60 మంది గీతా కార్మికులు తాటి చెట్లపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు తాటి చెట్ల తొలగింపును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వేరే ప్రాంతంలో హెలిపాడ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నర్మెట గ్రామ శాఖ అధ్యక్షుడు పుప్పాల నారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, గీత కార్మిక సహకార సంఘం నాయకులు యాదగిరి గౌడ్, రాములు గౌడ్, శేఖర్ గౌడ్, సురేశ్ గౌడ్, సతీశ్ గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్, చింటూ గౌడ్, తదితరులు పాల్గొన్నారు



పీసీసీ చీఫ్‌గా జగ్గారెడ్డిని నియమిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలుచుకుంటుంది. జగ్గారెడ్డి మరొక పీజేఆర్. ఆయన లాగే ప్రజా నాయకుడు. జగ్గారెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లలో గెలుస్తుంది. మహేశ్ గౌడ్‌ను తొలగించి జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్‌గా చేయాలి.

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రాంతీయం

సీఎంను కలిసిన పీసీసీ చీఫ్, ఎమ్మెల్యేలు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 17 : నిజామాబాద్ జిల్లా అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, కామారెడ్డి ఎమ్మెల్యేలు డా ఆర్ భూపతి రెడ్డి, రాకేష్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి తో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందులో భాగంగా డిచ్‌పల్లి మండలం గన్నారం ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి చర్యలపై చర్చ జరిగింది. గన్నారం ప్రాంతంలో రూ.25 కోట్ల వ్యయంతో ఒక ఎకరా భూమిలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. అలాగే జిల్లా భవిష్యత్ అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో దశలో నిజామాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టే ప్రతిపాదనపై చర్చలు జరిగాయి. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.



ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం

- **పాత పద్ధతిలోనే ఉపాధి హామీ కొనసాగించాలి!**
- **రోజు వారి వేతనం 800 ఇవ్వాలి పని దినాల సంఖ్యను 200 కు పెంచాలి!**
- **డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్**

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 17 : దేశవ్యాప్తంగా సామాజిక,దళిత వామపక్ష కార్యకర్తలు,నాయకులు చేసిన పోరాటం ఫలితంగా రాజ్యాంగం కల్పించిన పని హక్కును అనుసరించి 2006 సంవత్సరంలో నాటి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ చట్టాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలోని ఎన్డీఏ కేద్ర ప్రభుత్వం రకరకాల నిబంధనల పేరుతో అడుగడుగునా ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ తూట్లు పొడుస్తుందని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ మండిపడ్డారు. మంగళవారం పాత పద్ధతిలోనే ఉపాధి హామీని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ డిబీఎఫ్ ఆధ్వర్యంలో మార్చి ఎనిమిది అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు సమావేశంలో మహిళ కార్యకర్తలను ఉపాధి హామీ మహిళ కూలీలను శాలువలతో సన్మానించిన అనంతరం ఉపాధి హామీ కూలీలతో కలిసి హసన్‌పర్తి ఎంపీడీవో కార్యాలయం ఎదుట విబి గ్రామ్ జీ బిల్లు 2025 ను రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రమేష్, చుంచు రాజేందర్ మాట్లాడుతూ వీబీ గ్రామ్ బిల్లును ఉపసంహరించుకొని పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని,కొలతలతో సంబంధం లేకుండా కూలీలకు దినసరి కూలీ 800 రూపాయలు చెల్లించాలని,పని దినాల సంఖ్యను సంవత్సరానికి 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం కూలీలంతా సమిష్టిగా పోరాడుతూ కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు బొర్ర సంపూర్ణ ప్రజా సంఘాల జెఎసి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు బౌతు రాధ జిల్లానాయకులు దుర్గం వసంతగొవిండ్ అనిత ప్రతాప్ అడేపు రమగుగులోతు కౌసల్య, ఉపాధి హామీ మహిళ కూలీలు లత అంజలి, స్వరూప, సరోజన, అనసూర్య, కమల ఎల్లవ్వ పెద్ద ఎత్తున కూలీలు తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17 : భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్దేవ్ ల 95 వ వర్ధంతి సందర్భంగా ఈరోజు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్దేవ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాజేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిందిదొడ్డి సతీష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ లు మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అతి చిన్న వయసులో ఉరికంబాన్ని ముద్దాడిన వీరులు అని పేర్కొన్నారు ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం ఆ గొప్ప వీరులను త్యాగాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 17: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా దామెర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో స్త్రీలు, జనరల్ మెడిసిన్, ఎముకలు కీళ్లు, కంటి, దంత, పిల్లల వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలను అందించారు. వైద్య శిబిరంలో వైద్యులు ప్రజలకు ఉచిత సేవలు అందిస్తుండగా ఓపి విభాగం తదితర సేవలను కలెక్టర్ పరిశీలించారు 375 మంది కీ వైద్య పరీక్షలు ఉచితంగా మందులను పంపిణీ చేశారు అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి నమోదు, ఫార్మసీ, షోరూంలని కలెక్టర్ సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను గురించి వైద్యులు సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాట చేసినట్లు కలెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, దామెర తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవిస్థానిక సర్పంచ్ కల్పన వైద్యాధికారులు డాక్టర్ మహేంద్ర డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ ఎస్ కే జాస్మిన్ మెహర, డాక్టర్ ప్రమోద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా భక్తాంజనేయ ఆలయ 11వ వార్షికోత్సవం

ప్రతిపక్షం, దౌల్తాబాద్, మార్చి 17: దౌల్తాబాద్ మండల పరిధిలోని మల్లేశంపల్లి గ్రామంలో భక్తాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా శివపార్వతుల కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.సత్యనారాయణ స్వామి వ్రతం, హోమం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యశోద, మాజీ ఎంపీపీ ధారా వరలక్ష్మి సత్యం, దౌల్తాబాద్ సర్పంచ్ అనురాధ రమేష్, ఉపసర్పంచ్ బాలకృష్ణ, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ పంటతో అధిక లాభాలు

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 17: సాంప్రదాయ పంటల కంటే ఆయిల్ ఫామ్ పంటతోనే రైతులకు అధిక లాభాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.మంగళవారం పాపన్నపేట మండలంలోని గాంధారి పల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారులతో పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. వాణిజ్య పంటలపైరైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ ఆయిల్ పామ్ పంట సాగు విధానం, దిగుబడి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పంట పెరుగుదలను పరిశీలించిన కలెక్టర్ రైతులు ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ ఆయిల్ పామ్ పంటను సమర్థవంతంగా సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు కోసం 2,500 ఎకరాలు లక్ష్యం గా పెట్టుకున్నారని, ఇప్పటికే 2000 ఎకరాలు సాగు అయిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటల సాగు పరిశీలన కోసం ఈనెల 20,21,22 తేదీలలో సిద్దిపేట జిల్లాలోని ఆయిల్ ఫామ్ పంటల సాగు పరిశీలంకోసం 70 బస్సులు ఏర్పాటు చేసి మెదక్ జిల్లా రైతులను పంపుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో.. మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ ఉద్యానవన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం, అవయవ దానం గొప్పది

- **ఏలేటి రాజశేఖర్ రెడ్డి**

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 17: నేటి సమాజంలో రక్తదానం అవయవాల దానం ప్రాముఖ్యత సంతరించుకుందని లయన్స్ క్లబ్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. లయన్స్ క్లబ్ సంజీవని రిజియన్ కాన్ఫరెన్స్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంస్థగా ఎదిగిందని 320 డి పక్షాన గోడ పత్రికల ద్వారా ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం గొప్ప విషయం అన్నారు. లయన్స్ జిల్లా సెక్రెటరీగా కొనసాగుతున్న ఏలేటి రాజశేఖర్ రెడ్డి రక్తదానం అవయవాళ దానం గోడపత్రిక ఆవిష్కరణకు కృషి చేసి డిస్ట్రిక్ట్ ఎక్సలెంట్ సెక్రెటరీ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు . ఈ సందర్భంగా లైన్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు మాట్లాడుతూ విపత్కర సమయంలో లైన్స్ క్లబ్ ఎంతో మందిని ఆదుకొందని గుర్తు చేశారు. రాజశేఖర్ రెడ్డి చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. నూతన సభ్యత్వం పొందిన లైన్స్ క్లబ్ సభ్యులు ఎల్ సి ఐ ఆఫ్ కి తోచిన సహాయాన్ని అందజేస్తే అభివృద్ధి దశలో ముందుకెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా లయన్ సూర్య రాజ్ ప్రకాష్ రావు చారి రమేష్ మామిడాల శ్రీనివాస్ విజయలక్ష్మి నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.



కాకతీయలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 17: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో హైస్కూల్లో నర్సరీ,ఎల్కేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి స్మాట్ స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు నైతిక విలువలతో పాటు సంస్కృతి,సంప్రదాయాన్ని ప్రతిబింబింపజేసే కార్యక్రమాలను చేయడం అభినందనీయమని తెలిపారు.ఒక తరగతి నుండి మరో తరగతికి ఉత్తీర్ణత సాధించినట్లు ఒక సర్టిఫికెట్ను చిన్న తరగతుల్లోనే విద్యార్థులకు గుర్తింపునివ్వడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు మహనీయుల అడుగు జాడల్లో పయనించి గొప్ప వారిగా ఎదగాలని ఆకాంక్షించారు.విద్య నేర్పిన గురువులకు చదువుకున్న పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తేవాలని ఉద్బోధించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు,పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల వేతనం 18 వేలు నిర్ణయించేంత వరకు పోరాటం

- **బడ్జెట్ సమావేశంలోనే నిధులు కేటాయిస్తూ నిర్ణయం చేయాలి**
- **జీతాలు పెంచకపోతే మంత్రులు ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తాం**
- **సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి**



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 17: ఈ బడ్జెట్ సమావేశంలోనే ఆశా వర్కర్లకి ఫిక్స్డ్ వేతనం 18 వేల రూపాయలు నిర్ణయం చేయాలని, లేకుంటే మంత్రులు ఎమ్మెల్యేలు ముట్టడిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్ స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రెండో రోజు ఆశ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించిన అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ భారీ గేటులను తోసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా కొంత ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. పోలీసులు జోక్యం చేసుకొని ఆశా కార్యకర్తలకు అధికారులు పిలిపిస్తామని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గేటు బయటకు వచ్చి సిఐటియు నాయకులతో చర్చించారు. ఆశా లీడర్స్ నాయకత్వంతో అధికారులతో కలిపి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి తమ పరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాల స్వామి మాట్లాడుతూ....రాష్ట్రప్రభుత్వం ఆశా వర్కర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఈ బడ్జెట్ సమావేశంలోనే 18 వేల రూపాయలు ఫిక్స్డ్ వేతనం నిర్ణయం చేయాలని, పి ఎఫ్ ఎస్ ఐ సౌకర్యాలతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే జనాభా ప్రాతిపాదికన ఆశా వర్కర్ల కేటాయింపులు ఉన్నప్పటికీ మండల కేంద్రాలలో పట్టణ కేంద్రాలలో ఉన్న ఆశ వర్కర్లకు ఎక్కువ మంది జనాభా కు ఒకరు ఆశ వర్కర్ ఉంటున్నారని దీని ఫలితంగా ఆశా వర్కర్లకి వర్క్ లోడ్ ఎక్కువ అవుతుందని ఇలాంటి స్థానిక సంస్థలు కూడా అనేక ఉన్నాయని ఇప్పటికే ఆశ వర్కర్లపై అధికారులు, కింది స్థాయి ఉద్యోగులు వేధింపులకు గురి చేస్తున్నారని వీటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతనాలు పెంచకపోతే సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్రంలో మంత్రుల ఇండ్లను ఎమ్మెల్యేలు ముట్టడిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ ధర్నా కు సంఘీభావం ప్రకటించి మద్దతుగా మాట్లాడిన సిపిఎం సిద్దిపేట జిల్లా కార్మిక సభ్యులు రాళ్ల బండి శశిధర్ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల భాస్కర్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ బాన్ ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూలక్ష్మి, ప్రవీణ కోశాధికారి భాగ్యలక్ష్మి ఆశా వర్కర్లు బాలమణి భాగ్య శ్రీలత అంజలి రమ కమల లక్ష్మి వాణి అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఈదురు గాలుల బీభత్సం.. నేల మట్టమైన పంటలు

- **నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి**
- **బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి**

ప్రతిపక్షం, తొగుట, మార్చి 17: అకాల గాలి దుమారం మూలంగా పంట చేలు నెలకొరిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటరావుపేటలో సోమవారం రాత్రి వడగాలి మూలంగా నష్టపోయిన గ్రామానికి చెందిన మక్కల శ్రీనివాస్ మొక్కజొన్న పంట చేలును పార్టీ శ్రేణులతో కలిసి అయన పరిశీలించారు. పెద్ద ఎత్తున గాలి వీయడంతో చేతికి వొచ్చిన మొక్కజొన్న చేలు నేలకు ఒరిగిందని, అలాగే మామిడి కాయలు నేలకు రాలడంతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. గత 15రోజుల క్రితం కూడా గాలి దుమారం మూలంగా మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంట చేలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రుణమాఫీ అసంపూర్తిగా అమలు చేసిన ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మార్చుకొని పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.. కార్యక్రమం లో నాయకులు బండారు స్వామి గౌడ్, పులిగారి శివయ్య, ఎర్రోల్ల చంద్రం, జహంగీర్, ఎంగలి నరేందర్, నర్సింహా రెడ్డి, సుతారి రాంబాబు, బెజ్జనమైన నవీన్ తదితరులున్నారు.



నేను పార్టీ మారాలనుకునే ఆలోచనకు కారణం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్. కాంగ్రెస్‌తో తనది 40 ఏళ్ల బంధం. నాకు ఎంత ఇబ్బంది ఉంటే పార్టీ మార్పుపై ఆలోచిస్తున్నానో ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇంకా కాంగ్రెస్‌లోనే ఉండాలని కోరుకుంటున్నా. పార్టీ పిలుపు మేరకు 4 దశాబ్దాలుగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. జగిత్యాలలో ముున్ముందు ఏం జరుగుతుందో చూడాలి.

- మాజీ మంత్రి, కాంగ్రెస్‌నేత జీవన్ రెడ్డి



క్రీడలతో పిల్లల్లో క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 17 : టైక్వాండో వంటి క్రీడలు నేర్చుకోవడం వల్ల పిల్లల్లో క్రమశిక్షణ మంచి వ్యక్తిత్వం పెరుగుతాయని అదనపు జిల్లా సెషన్స్ జడ్జి దుర్గ ప్రసాద్ అన్నారు. పిల్లలు ఉదయాన్నే లేవటం ద్వారా వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. జిల్లా కేంద్రం లోని వినాయక్ నగర్ లోని బసవ గార్డెన్‌లో అమెచ్యూర్ టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్, బెల్ట్ అవార్డింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి హాజరై మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు వారికి ఏదైనా ముప్పు వస్తే దాని నుంచి తప్పించుకునేందుకు టైక్వాండో వంటి శిక్షణలు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. అలాగే ఇలాంటివీ నేర్చుకోవటం ద్వారా చదువుల్లో కూడా వారు ముందుంటారని అన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా శిక్షణకు పంపిస్తున్న తల్లిదండ్రులను జడ్జి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులందరూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జడ్జి టైక్వాండో కోచ్ మనోజ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అధ్యక్షుడు బస్వ లక్ష్మీ నర్సయ్య, బ్లాక్ బెల్ట్ సభ్యులు గంగాధర్, నాగరాజ్, నాగరాణి, సిద్ధార్థ, గోపీకృష్ణ, సుమిత్, సాయిరామ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



'గీతం'కు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు అవార్డు

- అందజేసిన మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17 : ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు చేపట్టిన కార్యక్రమాలకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అందిస్తున్న ఉదారమైన విరాళాలు, స్థిరమైన మద్దతుకు గుర్తింపుగా మంగళవారం ఒక జ్ఞాపికను, అవార్డును అందజేశారు. ఈ ప్రశంసా పత్రంలో గీతం యొక్క నిస్వార్థ నిబద్ధతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, నిరుపేదల జీవితాలలో సానుకూల మార్పు తీసుకురావడంలో దాని ప్రయత్నాలు కీలక పాత్ర పోషించాయని, విస్తృత సమాజానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చేతుల మీదుగా గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మకు అందజేశారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత నాలుగేళ్లగా గీతంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను చురుకుగా నిర్వహిస్తున్నారు. రక్తదానం యొక్క ప్రాణరక్షక ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, విద్యార్థులలో కరుణ, సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తున్నారు. ప్రాణాలను కాపాడటంలో సహాయపడి, ఇతరులను కూడా ఇటువంటి గొప్ప కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించే విద్యార్థుల ఉదారతను, నిస్వార్థ సహకారాన్ని నిర్వాహకులు ప్రశంసించడంతో ఈ కార్యక్రమానికి విస్తృత ప్రశంసలు లభించాయి. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గీతం డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు ఈ అవార్డును అందుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు. ఇటువంటి ప్రభావవంతమైన సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.



రైతు వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం

ప్రతిపక్షం, గుండాల, మార్చి 17: అఖిలభారత రైతు కూలీ సంఘం గుండాల మండల కార్యవర్గ సమావేశం మంగళవారం బచ్చలి సారయ్య అధ్యక్షతన గుండాలలో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. చంద్రం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు రైతులకు నష్టదాయకమని విమర్శించారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. 100 శాతం కేంద్ర నిధులతో అమలవుతున్న ఈ పథకాన్ని 60 శాతం నిధులతో కొనసాగిస్తూ, పని దినాలను 125 రోజులకు పరిమితం చేయడం గ్రామీణ పేదలకు అన్యాయమని తెలిపారు. ఇది పథకాన్ని క్రమంగా ఎత్తివేయడానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే 2025 విత్తన చట్ట ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు విత్తనాల భద్రతపై ప్రభుత్వం హామీ ఇవ్వకుండా బాధ్యత నుంచి తప్పుకుంటోందని విమర్శించారు. నూతన విద్యుత్ సవరణ బిల్లు ద్వారా స్మార్ట్ మీటర్లను అమలు చేసి రైతులపై అదనపు భారాలు మోపే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.గత వ్యవసాయ సీజన్‌లో ఎదురైన యూరియా కొరత ఈ సారి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుని సరిపడా ఎరువులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే ఎం లో భాగస్వామ్యంగా దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ పోరాటంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మండల కార్యవర్గం పిలుపునిచ్చింది. అలాగే మండలంలో 5000 మంది రైతులను ఏఐకేఎంఎస్ లో సభ్యులుగా చేర్చాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు, గుండాల సర్పంచ్ కొరం సీతారాములు, గడ్డం లాలయ్య, పాయం ఎల్లయ్య, అరేం జోగయ్య, జబ్బ పోతన్న, గొగ్గల సాంబశివరావు, పూణెం పొట్టయ్య, తప్పెట్ల రాములు, మోకాళ్ల సూర్యనారాయణ, పూనెం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- సేవల నాణ్యతపై కఠిన హెచ్చరికలు



ప్రతిపక్షం, గుండాల, మార్చి 17: గుండాల మండలంలో ప్రభుత్వ సేవల నాణ్యతను సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, పశుసంవర్ధక, పరిపాలన రంగాలకు చెందిన పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సమయానికి నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ముత్తపురం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదులు, ఆర్‌ఓ ప్లాంట్, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, కంప్యూటర్ ల్యాబ్ వంటి సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అయితే పరిశుభ్రత లోపాలు, కిచెన్‌లో అస్వచ్ఛత, సిబ్బంది కొరత, మెనూ పాటించకపోవడం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో లోపాలు సరిచేయకపోతే అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ గుర్తింపు రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే భోజనం ప్రతిసారి తాజాగా ఉండేలా చూడాలని ఆదేశించారు. తదుపరి గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన మందుల గది, ల్యాబ్, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించారు. డెంగ్యూ పరీక్ష కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మందుల పంపిణీ గదిలో సిబ్బంది లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి ఫార్మసిస్ట్‌ను వెంటనే నియమించాలని ఆదేశించారు. అలాగే మందుల నిల్వ గదికి ఎయిర్ కండిషనింగ్ సదుపాయం కల్పించాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ నివారణకు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని సూచించారు.గుండాలలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ పనుల నాణ్యతలో రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.అదేవిధంగా కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన ఆయన, అక్కడ ఆర్‌ఓ ప్లాంట్ రెండు సంవత్సరాలుగా పనిచేయకపోవడాన్ని గమనించి వెంటనే మరమ్మత్తులు లేదా కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కిచెన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులకు మినరల్ వాటర్ అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. డైనింగ్ హాల్ మంజూరు ప్రతిపాదనను పరిశీలించి త్వరలో అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని కూడా సందర్శించిన కలెక్టర్ మందుల నిల్వలు, రికార్డులు, సేవల నాణ్యతను సమీక్షించారు. గిరిజన ప్రాంతాల్లో పశువులపై ఆధారపడి జీవించే ప్రజలకు సమయానికి వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పశువులకు టీకాలు, ముందస్తు జాగ్రత్తలు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ ఖాసీమ్, ఎంపీడీవో బాలరాజు,ఇంతియాజ్ ఖాన్, నితిన్ సింగ్, డాక్టర్ సుధీర్, శ్రావణ సంధ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దు

- టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన
- రూ. 3 కోట్లతో ఈద్గా అభివృద్ధి కోసం ప్రతిపాదనలు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17 : సంగారెడ్డి పట్టణం లోని హాస్టల్ గడ్డ వద్ద గల ఈద్గా మైదానాన్ని సోమవారం టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పరిశీలించారు. రంజాన్ పండుగ రోజున ఈద్గా వద్ద వేలాది మంది ముస్లిం సోదరులు నమాజ్ లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఈద్గా వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని , ఈద్గా వద్దకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆమె మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రంజాన్ పండుగ రోజు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని , అవసరమైతే ట్రాఫిక్ ను నియంత్రించాలని సంగారెడ్డి రూరల్ సిఐ ని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈద్గా అభివృద్ధి కోసం రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయని, జగ్గారెడ్డి త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తారని వివరించారు. ఈద్గా వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ హఫీజ్, కౌన్సిలర్ నవాజ్, ఫాయిజ్ , ఈద్గా కమిటీ సభ్యులు అతీకుద్దిన్, బాబర్, షఫీ లతో పాటు మైనార్టీ నాయకులు అన్వర్, బబ్బు పాల్గొన్నారు.

చావుబతుకుల మధ్య చిన్నారి

ఆదుకున్న ఖాకీ మనసు



ప్రతిపక్షం, కొత్తగూడ, మార్చి 17: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రానికి సమీపంలోని బూరుగుగుంపు గ్రామంలో హృదయాన్ని కదిలించే ఘటన చోటు చేసుకుంది. మల్లెల అశ్విని మహేష్ దంపతులకు జన్మించిన మూడు నెలల పసికందు ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారి జీవన పోరాటం కుటుంబాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పుట్టిన చిన్నారి నవ్వులతో ఇల్లు ఆనందంగా మారాల్సిన సమయంలో, ఆసుపత్రి బెడ్‌పై ఆమె ప్రాణాల కోసం పోరాడుతుండటం తల్లిదండ్రులకు తీవ్ర వేదన కలిగిస్తోంది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఈ కుటుంబం వైద్య ఖర్చులను భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. తమ బిడ్డను ఎలా కాపాడుకోవాలో అర్థంకాక తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో కన్నీరు మున్నీరవుతున్నారు .ఈ విషయం తెలుసుకున్న కొత్తగూడ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఇమ్మడి రాజ్‌కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన వంతు సహాయంగా రూ. 4,000 నగదును అందజేశారు. కేవలం విధి నిర్వహణలోనే కాకుండా, సమాజం పట్ల తన బాధ్యతను గుర్తించి ముందుకు రావడం ద్వారా ఎస్ఐ తన సేవాభావాన్ని చూపించారు .ఎస్ఐ అందించిన ఈ ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. తమ బిడ్డను కాపాడేందుకు పోరాడుతున్న తల్లిదండ్రులకు ఇది ఓ పెద్ద అండగా నిలిచింది.ఈ ఘటనతో పోలీసులలో కూడా మానవత్వం ఎంత గొప్పదో మరోసారి స్పష్టమైంది. అవసర సమయంలో ముందుకు వచ్చి సహాయం చేయడం ద్వారా సమాజంలో మంచి మార్పుకు దారితీసే సందేశాన్ని ఎస్ఐ ఇమ్మడి రాజ్‌కుమార్ అందించారు.

ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి


- తెలంగాణ వర్సిటీ ఉపకులపతి ఆచార్య టి. యాదగిరిరావు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 17 : ఉద్యోగం పొందని నిరుద్యోగులు ఎలాంటి నిరాశ చెందవద్దని తెలంగాణ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ యాదగిరి రావు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ డిచ్‌పల్లి క్యాంపస్‌లో నిర్వహించిన "మెగా జాబ్ ఫెయిర్-2026" కార్యక్రమాన్ని ఉపకులపతి ప్రొఫెసర్ యాదగిరి రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ జాబ్ ఫెయిర్‌ను నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కులపతి అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగ నియామక ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొంటూ అభ్యర్థుల్లో ధైర్యాన్ని నింపారు. అలాగే విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని, ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులు (HRలు) మాట్లాడుతూ అభ్యర్థులను గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ మరియు అవసరమైన ట్రైనింగ్ ప్రక్రియల ద్వారా ఎంపిక చేసి, తగిన జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మంగళవారం జరిగిన ఇంటర్వ్యూలలో దాదాపు 1200 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా 603 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ స్థాపన తర్వాత ఇంత భారీ స్థాయిలో నిర్వహించిన ఈ మెగా జాబ్ ఫెయిర్ యూనివర్సిటీ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన మెగా జాబ్ ఫెయిర్ లో 50కు పైగా కంపెనీలు పాల్గొని, 5000కు పైగా ఉద్యోగ అవకాశాలతో ముందుకురాగా 1200 మంది అభ్యర్థుల హాజరయ్యారు. ఈ మెగా జాబ్ ఫెయిర్‌లో టెక్ మహేంద్ర, సూతెర్ ల్యాండ్, టెల్ పెర్ఫార్మెన్స్, ఆక్సిస్ నీట్, అపోలో ఫార్మసీ, హెటేరో, పేటీఎం, రిలయన్స్ ట్రెండ్స్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర 50కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ఈ జాబ్ ఫెయిర్‌లో ఐటీ, ఐటీ ఈఎస్, ఫార్మా, నర్సింగ్, బ్యాంకింగ్, రిటైల్, ఎఫ్ ఎం సి జీ, హాస్పిటాలిటీ వంటి విభిన్న రంగాల్లో 5 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచారు. 10వ తరగతి నుండి పీజీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థులకు అవకాశం కల్పించారు. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి సుమారు 1200 మంది అభ్యర్థులు పాల్గొని వివిధ కంపెనీల ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్. నాగరాజు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, ప్రిన్సిపాల్ ఆచార్య రాంబాబు, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్, ఆచార్య ఆంజనేయులు, డాక్టర్ నాగరాజు, ప్లేస్‌మెంట్ సెల్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



టీమ్‌లో సీనియర్ బౌలర్ నేనుండగా 2024 పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియాతో సుందర్‌ను ఆడించారు. అప్పుడే నా టైమ్ అయిపోయిందని గ్రహించా. గంభీర్ అంటే తనకు ఇష్టమని, ఆయన వ్యక్తుల కంటే జట్టుకే ప్రాధాన్యం ఇస్తారు. కోహ్లీ, రోహిత్, తాను ఎప్పుడూ ఒకరినొకరు నిందించుకోలేదు. గెలుపు కోసమే ప్రయత్నించాం.
- క్రికెటర్ అశ్విన్



విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ రద్దు

- లోక్‌సభలో స్పీకర్ ప్రకటన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 17: విపక్షానికి చెందిన 8 మంది సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను లోక్‌సభ మంగళవారం రద్దు చేసింది. స్పీకర్ ఓం బిర్లా తమ సస్పెన్షన్‌ను రద్దు చేసిన తర్వాత విపక్ష ఎంపీలు మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. బడ్జెట్ సమావేశాల్లో నిరసనల సందర్భంగా అనుచిత ప్రవర్తనకు పాల్పడిన 8 మంది ఎంపీలపై ఫిబ్రవరి 3న స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు, సీపీఎంకు చెందిన ఒకరు ఉన్నారు. మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించిన ఓ తీర్మానం ద్వారా సభ్యుల సస్పెన్షన్‌ను లోక్‌సభ రద్దు చేసింది. మరోవైపు సభలో ప్లకార్డులు, పోస్టర్లు, ఏఐతో రూపొందించిన చిత్రాలను భవిష్యత్తులో ప్రదర్శించవద్దని స్పీకర్ సభ్యులను కోరారు.

విశ్వ వీక్షణం



కాబూల్‌లో ఆస్పత్రిపై క్షిపణి దాడి

- 400 మంది రోగుల మృతి
- మరో 250 మంది రోగులకు గాయాలు
- పాక్ సైనిక దాడిగా అఫ్ఘాన్ ఆరోపణ
- సైనిక స్థావరాలపైనే దాడి చేశాం: పాకిస్థాన్ ప్రకటన

కాబుల్ : అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్‌లో మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందచేసే ఆస్పత్రిపై సోమవారం జరిగిన క్షిపణి దాడి జరిగింది. పాకిస్థాన్ సైన్యం ఈ దాడికి పాల్పడినట్లు అఫ్ఘాన్ ప్రభుత్వ అధికారులు ఆరోపించగా పాక్ ఖండించింది. మృతుల సంఖ్య ఇప్పటివరకు 400 చేరుకుందని అఫ్ఘాన్ ప్రభుత్వ ఉప అధికార ప్రతినిధి హందుల్లా ఫిత్రత్ మంగళవారం తెలిపారు. మరో 250 మంది వరకు గాయపడ్డారని ఆయన చెప్పారు. మృతులు, క్షతగాత్రులలో ఎక్కువ మంది దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులేనని ఆయన తెలిపారు. సోమవారం రాత్రి తమ సైన్యం అఫ్ఘాన్ సైనిక, ఉగ్రవాద మద్దతు గల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు పాక్ తెలిపింది. పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపలేదని స్పష్టం చేసింది. దాడి జరిగిన సమయంలో ఒమిద్ ప్రభుత్వ దవాఖానలో దాదాపు 3,000 మంది రోగులు ఉన్నట్లు తాలిబన్ ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. బాంబు దాడికి శిథిలమైన భవనంలో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్న వీడియో ఫుటేజీని స్థానిక టీవీ స్టేషన్లు ప్రసారం చేశాయి. మొత్తం దవాఖాన ప్రాంగణమంతా మంటల్లో చిక్కుకుందని దవాఖాన సెక్యూరిటీ గార్డ్ చెప్పాడు. దవాఖానకు చెందిన సిబ్బంది వసతి గృహంలో మొత్తం 25 మంది ఉండగా తాను ఒక్కడినే ప్రాణాలతో బయటపడినట్లు అతను చెప్పాడు. సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో దవాఖాన వద్దకు సైన్యం చేరుకుందని, ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఓ యుద్ధ విమానంపై యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్లు కాల్పులు జరపగా ఆ జెట్ నుంచి దవాఖానపై బాంబులు పడ్డాయని మిద్ స్టానిక్‌జై అనే మరో సెక్యూరిటీ గార్డు తెలిపాడు. బాంబుల దాడిలో దవాఖాన భవనం కుప్పకూలిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొగచూరిన మొండి గోడలు, గుట్టలుగా భవన శిథిలాలు అక్కడ దర్శనమిస్తున్నాయి.పాకిస్థాన్‌తో తమ ఉమ్మడి సరిహద్దు వద్ద కాల్పులు జరిగి తమ పౌరులు నలుగురు మరణించిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరిగినట్లు అఫ్ఘాన్ అధికారులు తెలిపారు. గత కొన్ని రోజుల్లో కాబుల్‌పై పాక్ క్షిపణి దాడులు జరపడం ఇది మూడవసారి. కాగా, సోమవారం రాత్రి అఫ్ఘాన్‌లోని సైనిక స్థావరాలు, ఉగ్రవాద మద్దతు గల సపుపియిత‌పైనే దాడులు నిర్వహించినట్లు పాక్ సమాచార శాఖ ఎక్స్ పోస్టులో స్పష్టం చేసింది. వాస్తవాలను వక్రీకరించి మనోభావాలను రెచ్చగొట్టేందుకే డ్రగ్స్ బాధితుల పునరావాస కేంద్రంపై దాడి జరిగినట్లు అఫ్ఘాన్ చెప్తున్నదని పాక్ ఆరోపించింది. సీమాంతర ఉగ్రవాదానికి తాను ఇస్తున్న మద్దతును సమర్థించుకునేందుకు అఫ్ఘాన్ ఈ చర్యకు పాల్పడినట్లు కూడా పాక్ ఆరోపించింది. కాబుల్‌లోని దవాఖానపై దాడిని భారత ప్రభుత్వం ఖండించింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తం చేసింది. ఇది పిరికి పంద, అమానుష చర్య అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

పాక్‌ను జవాబుదారీగా చేయాలి

- కాబుల్ దాడిని ఖండించిన భారత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 17: అఫ్ఘానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సైనిక స్థావరంగా ఏమాత్రం సమర్థించుకోలేని ఆస్పత్రిపై దాడి చేసి, పెద్ద సంఖ్యలో పౌరుల ప్రాణాలను బలిగొనడం అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య అని మండిపడింది. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శించింది. ఈ హేయమైన చర్య ప్రాంతీయ శాంతిభద్రతలకు ప్రత్యక్ష ముప్పని పేర్కొంది.అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సరిహద్దు వెలుపల హింసకు పాల్పడటం పాక్ బరితెగింపు ధోరణికి అద్దంపట్టిందని ధ్వజమెత్తింది. ఆస్పత్రిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతం, ఏ చట్టం, ఏ నైతికత సమర్థించలేదని స్పష్టం చేసింది. పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని, అఫ్గాన్ పౌరులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఈ విషాద సమయంలో అఫ్ఘాన్లకు అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది.





బిడ్డను దత్తత తీసుకున్న మహిళకూ ప్రసూతి సెలవు

- రుతుక్రమ సెలవులపైనా సుప్రీం కీలక నిర్ణయం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 17: చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు సంబంధించి ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనే నిబంధన సరికాదని, దీనికి అనుమతించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020లోని సెక్షన్ 60(4) రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చిన్నారి వయసుతో సంబంధం లేకుండా దత్తత తీసుకున్న సమయం నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేందుకు అర్హత ఉంటుందని తెలిపింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్న బిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదని, ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. నందూరి హంసనందిని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. ఈ క్రమంలోనే సామాజిక భద్రత చర్యగా పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు సూచించింది. అంతకుముందు రుతుక్రమ సెలవులపైనా సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు రుతుక్రమ సెలవులు తప్పనిసరి చేస్తూ జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని తీసుకురావాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని తిరస్కరించింది. చట్టబద్ధంగా దీన్ని తప్పనిసరి చేస్తే మహిళలకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరని, ఈ చర్య మహిళల పట్ల లింగ వివక్షకు దారితీసే ప్రమాదం ఉందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.

సింగిడి
హైదరాబాద్
బుధవారం
18.03.2026
11
ప్రతిపక్షం
Prathipaksham.in





పిల్లలకు రోజూ ఒక్క గుడ్డు పెడితే ఏమౌతుంది?

కోడిగుడ్డులో చాలా పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా కోడిగుడ్డులో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. మరి, అలాంటి కోడిగుడ్డును రోజూ పిల్లలకు పెడితే ఏమౌతుందో తెలుసా?

పోషకాల గుడ్డు పిల్లలకు ఎలా పెట్టాలి?

కోడిగుడ్డు ఆరోగ్యానికి మంచిది అనే విషయం స్పెషల్ గా చెప్పాల్సిన అవసరం లేదు. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది అని మన అందరికీ తెలుసు. ఎందుకంటే కోడి గుడ్డులో చాలా పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా ప్రోటీన్ కి బెస్ట్ సోర్స్. మరి అలాంటి కోడిగుడ్డును పిల్లలకు రోజూ ఇవ్వొచ్చా..? ఇలాంటి సందేహం చాలా మంది తల్లులకు ఉంటుంది. మరి, దీనికి నిపుణుల సమాధానం ఏంటో మనం ఓసారి చూద్దాం..

నిపుణుల ప్రకారం మనం సంవత్సరం వయసు దాటిన పిల్లలు అందరికీ రోజూ కోడిగుడ్డును ఇవ్వచ్చట. గుడ్డులోని పోషకాలు పిల్లల ఎదుగుదలకు సహాయపడుతాయి. అందుకే ఎలాంటి సందేహం లేకుండా పిల్లలకు గుడ్డు పెట్టొచ్చు.

గుడ్డులో ఉండే పోషకాలు


గుడ్డులో ప్రోటీన్, ఐరన్, ఒమేగా 3 కొవ్వు, విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ, విటమిన్ బి12, విటమిన్ బి6 వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి చాలా మంచివి. పిల్లల మెదడు చురుగ్గా పనిచేయడానికి సహాయపడతాయి.

కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది

గుడ్డులో ఉండే ప్రోటీన్ పిల్లల కండరాల పెరుగుదలకు చాలా ముఖ్యం. ఇందులోని పోషకాలు శరీరంలోని ఇతర కణాలను బాగుచేయడానికి కూడా సహాయపడతాయి. ఒక గుడ్డులో 6 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది పిల్లల శారీరక పెరుగుదలకు, బరువును నియంత్రించడానికి సహాయపడుతుంది. పిల్లలకు ఉదయం టిఫిన్ లో గుడ్డు ఇవ్వండి. ఆకలిని అదుపులో ఉంచుతుంది.

మెదడు అభివృద్ధికి సహాయపడుతుంది

గుడ్డులో ఉండే కోలిన్ పిల్లల మెదడు అభివృద్ధికి చాలా ఉపయోగపడుతుంది.
పిల్లల జ్ఞాపకశక్తి, అభ్యాస నైపుణ్యాలను పెంచుతుంది. పిల్లల ఆహారంలో రోజూ గుడ్డు చేర్చితే వారి నేర్చుకునే, అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.



ఎముకలను దృఢంగా ఉంచుతుంది

గుడ్డులో ఉండే విటమిన్లు పిల్లల ఎముకలను దృఢంగా ఉంచడానికి సహాయపడతాయి. రోజూ ఉదయం పిల్లలకు గుడ్డు ఇస్తే వారి దంత ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎముకలు బలంగా తయారవుతాయి.

కంటి ఆరోగ్యానికి మంచిది

పిల్లలు ఎక్కువ సేపు స్క్రీన్ ముందు కూర్చుంటే వారి కళ్ళు బలహీనపడతాయి. అలాంటప్పుడు పిల్లలకు గుడ్డు ఇవ్వడం చాలా మంచిది. గుడ్డులో ఉండే యాంటీఆక్సిడెంట్లు పిల్లల కళ్ళను హానికర కిరణాల నుంచి కాపాడుతాయి. వారి కంటి చూపును మెరుగుపరుస్తాయి.


జీర్ణక్రియకు సహాయపడుతుంది

గుడ్డులో ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పిల్లల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది.

పిల్లలకు గుడ్డు ఎలా ఇవ్వాలి?

పిల్లలకు ఉడికించిన గుడ్డు ఇవ్వడం మంచిది. ఆమ్లెట్, శాండ్విచ్, గుడ్డు కూర వంటివి కూడా చేసి పెట్టొచ్చు.









సన్ రైజర్స్ పై సునీల్ గవాస్కర్ ఫైర్

అబ్రార్ కొనుగోలుపై విమర్శలు

ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్ లీగ్' కోసం ఇటీవలే ముగిసిన వేలంలో పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ యాజమాన్యం కొనుగోలు చేయడంపై ఆగ్రహజ్వాల ఆగడం లేదు. తాజాగా ఈ విషయంపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందిస్తూ.. '2008లో ముంబై దాడులు జరిగిన తర్వాత ఐపీఎల్‌లో ఫ్రాంచైజీ యజమానులు పాకిస్థాన్ ఆటగాళ్లను పక్కనబెట్టేశారు. ఫ్రాంచైజీ నుంచి ఫీజు రూపంలో వచ్చిన మొత్తాన్ని పాకిస్థానీ ప్లేయర్ వారి ప్రభుత్వానికి పన్నుల రూపంలో చెల్లిస్తాడు. అవే డబ్బులతో పాక్ ప్రభుత్వం ఆయుధాలు కొనుగోలు చేసి వాటిని భారత సైన్యంపైనే ప్రయోగిస్తున్నది. అంటే ఒక పాకిస్థానీ ఆటగాడికి చెల్లించే ఫీజు పరోక్షంగా అది భారత సైనికులు, ప్రజల ప్రాణాలు కోల్పోవడానికి కారణమవుతున్నది. అందుకే పాక్ క్రికెటర్లైనా, సినిమా నటులైనా వారిని బహిష్కరించాలి' అని చెప్పాడు.

మొదలైన ఐపీఎల్ సందడి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ సందడి మొదలైంది. మరో పది రోజుల్లో మొదలుకానున్న 19వ సీజన్ కోసం జట్లన్నీ సిద్ధమవుతున్నాయి. ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ కోసం ఆయా జట్ల క్రికెటర్లు సన్నాహాలు షురూ చేశారు. దేశవాళీ క్రికెటర్లు ఇప్పటికే ప్రాక్టీస్‌లో చెమటోడుస్తుండగా, అంతర్జాతీయ క్రికెటర్లు తమ తమ ఫ్రాంచైజీలతో చేరుతున్నారు. సీజన్‌కు ముందు డిఫెండింగ్ చాంపియన్ ఆర్‌సీబీకి హాజిల్‌వుడ్ రూపంలో ఎదురుదెబ్బ తాకగా, ఎస్ఆర్‌హెచ్ కొన్ని మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది. గత సీజన్ల లాగే చెన్నై ఐకాన్ ధోనీ రిటైర్మెంట్ పై ఊహాగానాలు వెలువడుతుండగా, 'ముంబై చా రాజా' రోహిత్‌శర్మ ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. రాజస్థాన్ రాయల్స్‌తో తన బంధాన్ని తెంచుకున్న చెటా సంజూ శాంసన్..ఈసారి చెన్నై తరఫున అదరగొట్టేందుకు సై అంటున్నాడు. తన కెరీర్ ఆరంభం నుంచి నిరుటి సీజన్ దాకా ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన మాజీ సారథి సంజూ శాంసన్ ఆ జట్టును వీడటానికి గల కారణాలపై తొలిసారిగా నోరువిప్పాడు. శాంసన్ మాట్లాడుతూ.. 'రాజస్థాన్ ఆటగాళ్లు, కోచింగ్, ఇతర సహాయక సిబ్బందిలో చాలామందితో నాకు సత్సంబంధాలున్నాయి. నా కెరీర్‌లో రాయల్స్‌కు వ్యతిరేకంగా ఆడుతుండటం ఇదే మొదటిసారి. కానీ మైదానంలో భావోద్వేగాలు నా ఆటను ప్రభావితం చేయలేవు. రాయల్స్‌లో నా సమయం ముగిసిందని నేను భావించా. అందుకే ఆ జట్టు నుంచి బయటకు వచ్చా. ఇప్పుడు మేం ముఖాముఖి ఎదురుపడితే నేను మిగతా ప్రత్యర్థుల మాదిరిగానే ఆ జట్టుపై అత్యుత్తమ క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తా' అని తెలిపాడు. ఐపీఎల్ సీజన్ వేలానికి ముందు ట్రేడ్ డీల్ ద్వారా చెన్నైకి మారిన ఈ కేరళ స్టార్.. సూపర్ కింగ్స్ మాజీ సారథి ధోనీ నుంచి నేర్చుకునేందుకు ఇది తనకు చక్కని అవకాశమని చెప్పాడు.



రెండో టీ20లో కివీస్ ఆల్‌రౌండ్ షో

సఫారీలపై విజయం

స్వదేశంలో దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న న్యూజిలాండ్.. తొలి పోరులో ఓడినప్పటికీ రెండో మ్యాచ్‌లో సత్తాచాటింది. బ్యాట్ తో డెవాన్ కాన్వే (49 బంతుల్లో 60, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా బంతితో బెన్ సీర్స్ (3/14), లాకీ ఫెర్గూసన్ (3/16) తలా మూడు వికెట్లు పడగొట్టడంతో సౌతాఫ్రికాపై ఆ జట్టు 68 పరుగుల తేడాతో గెలుపొందింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. కాన్వే రాణించడంతో 20 ఓవర్లకు 175/6 స్కోరు చేసింది.



కాబూల్ ఆస్పత్రిపై దాడిని ఖండించిన క్రికెటర్లు

ఆఫ్గనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఓ దవాఖానాను లక్ష్యంగా చేసుకుని మంగళవారం తెల్లవారుజామున పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని ఆఫ్ఘాన్ క్రికెటర్లు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో సుమారు 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా 250 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. పవిత్ర రంజాన్ మాసం వేళ పాక్ చేసిన ఈ పనిని పిరికిపంద చర్యగా భారత్ వంటి దేశాలు ఖండించగా ఆఫ్ఘాన్ క్రికెటర్లు సైతం పాక్ తీరును తూర్పారబట్టారు. ఈ దుర్ఘటనపై ఆ జట్టు పేసర్ నవీన్ ఉల్ హక్ ఫేస్‌బుక్ వేదికగా స్పందిస్తూ.. 'ఇజ్రాయెల్, పాకిస్థాన్ పాలన మధ్య ఎటువంటి తేడా లేదు' అని రాసుకొచ్చాడు. ఆ జట్టు మాజీ సారథి రషీద్ ఖాన్ ఎక్స్‌లో.. ఇది యుద్ధ నేరమని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'పౌరుల ఇండ్లు, విద్యా సంస్థలు, దవాఖానాలను ఉద్దేశపూర్వకంగా గానీ పొరపాటున గానీ లక్ష్యంగా చేసుకోవడం యుద్ధనేరం. పవిత్ర రంజాన్ మాసంలో సాటి మనుషులపై కనికరం చూపకుండా ఇలాంటి దాడులకు పాల్పడటం బాధాకరం. ఈ ఘోరకృత్యంపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను శిక్షించాలని నేను ఐక్యరాజ్యసమితికి, మానవ హక్కుల సంస్థలను విజ్ఞప్తి చేస్తున్నా' అని భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. ఆఫ్ఘాన్ మాజీ సారథి మహ్మద్ నబీ, ఆ దేశ క్రికెట్ బోర్డు సైతం పాక్ దాడిని తీవ్రంగా ఖండించింది.




రాకాస.. అంచనాలు రెట్టింపు

నిహారిక కొణిదెల నిర్మించిన క్రేజీ ఫిల్మ్ "రాకాస" తాజాగా ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ఈ సినిమా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను 'శ్రీ లక్ష్మి నరసింహ మూవీ మేకర్స్' సంస్థ భారీ ధరకు దక్కించుకోవడం ఈ చిత్రంపై ఉన్న అంచనాలను రెట్టింపు చేసింది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంపై పరిశ్రమలో మంచి పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. ఈ సినిమా కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. అధర్వణ భద్రకాళి పిక్చర్స్ మరియు ప్రత్యంగిర సినిమాస్ ఆధ్వర్యంలో అమెరికా, యూకే, యూరోప్ వంటి దేశాల్లో 350కి పైగా స్క్రీన్లలో సినిమాను ప్రదర్శించనున్నారు. ఏప్రిల్ 2, 2026న ఓవర్సీస్ ప్రీమియర్లు పడనుండగా, ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా సినిమా థియేటర్లలోకి రానుంది. డిజిటల్ రైట్స్ ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ దక్కించుకోగా, సంగీత ప్రియుల కోసం సారేగమ మ్యూజిక్ ఆడియో హక్కులను సొంతం చేసుకుంది. సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లోనటిస్తున్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, ఆశిష్ విద్యార్థి వంటి హేమాహేమీలు నటిస్తున్న ఈ సినిమా రొమాన్స్, హ్యూమర్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్ కలయికతో రూపొందింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ మరియు టీజర్‌కు లక్షలాది వ్యూస్ రావడంతో సోషల్ మీడియాలో 'రాకాస' పట్ల ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



మెగాస్టార్ తో హరీష్ శంకర్ మూవీ?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రమోషన్లలో బిజీగా ఉన్న దర్శకుడు హరీష్ శంకర్, మెగాస్టార్ చిరంజీవితో మూవీ పై తాజాగా ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. మార్చి 19న ఉగాది కానుకగా పవన్ కళ్యాణ్ సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో జరిగిన ఒక ఇంటర్వ్యూలో, చిరంజీవితో ప్రాజెక్ట్ ఖచ్చితంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశాడు. చాలా కాలంగా మెగా అభిమానులు ఎదురుచూస్తున్న ఈ కాంబినేషన్ త్వరలోనే పట్టాలెక్కనుందని ఆయన భరోసా ఇచ్చాడు. ఈ సినిమా ఎలా ఉండబోతోందనే విషయంపై హరీష్ శంకర్ స్పందిస్తూ.. వింటేజ్ చిరంజీవిని వెండితెరపై చూపిస్తానని హామీ ఇచ్చాడు. ముఖ్యంగా 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' వంటి సినిమాల్లో చిరంజీవి పండించిన మాస్ మేనరిజమ్స్, కామెడీ టైమింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలిపాడు. "మెగాస్టార్‌ను ఒక అభిమాని ఎలా చూడాలనుకుంటారో, ఈ సినిమా కూడా అలాగే ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. మెగాస్టార్, హరీష్ శంకర్ ఇద్దరూ మాస్ ఎంటర్టైనర్లను అందించడంలో సిద్ధహస్తులు కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ పనుల వల్ల ఈ క్రేజీ ప్రాజెక్ట్ కొంత ఆలస్యమైనప్పటికీ, త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



'హ్యాపీ రాజ్' ఫస్ట్ సింగిల్ రిలీజ్

స్టార్ కంపోజర్‌హీరో జివి ప్రకాష్‌కుమార్ అప్ కమింగ్ మూవీ 'హ్యాపీ రాజ్'. హీరో డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియా రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై జైవర్ధ నిర్మించారు. మ్యాడ్ ఫేం శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్ గా నటిచింది. మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్పీ ద్వారా మార్చి 27న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సృష్టిస్తోంది, ఇటివల విడుదలైన పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ "అద్దిరా లెక్క" సాంగ్ రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకరన్ అదిరిపోయే బీట్స్‌తో ఈ సాంగ్‌ని కంపోజ్ చేశారు. గాయకుడు గోవింద్ ప్రసాద్ ఎనర్జీతో పాడిన ఈ పాటకు రెహ్మాన్ రాసిన లిరిక్స్ మంచి వైబ్ తీసుకొచ్చాయి. ఈ సాంగ్‌లో జివి ప్రకాష్‌కుమార్ చేసిన డ్యాన్స్ మూమెంట్స్ స్పెషల్ హైలైట్‌గా నిలిచాయి. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, స్టెప్స్ అన్నీ కలిసి సాంగ్‌ను మరింత ఎంటర్టైనింగ్‌గా మార్చాయి.

'ఉస్తాద్' ఈవెంట్లో మెరిసిన రాశీ

మార్చి 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ఉస్తాద్ భగత్ సింగ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఆ ఈవెంట్లో శ్రీ లీల తో పాటు రాశి ఖన్నా కూడా సందడి చేశారు. ముఖ్యంగా తన గ్లామర్ టచ్ తో ఉస్తాద్ ఈవెంట్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది రాశిఖన్నా. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన లెహంగాను ధరించి.. అందుకు తగ్గట్టుగా జువెలరీతో మరింతగా ఆకట్టుకుంది. ఇకపోతే నైట్ ఈవెంట్లో తన దుస్తులతో ఈవెంట్ కే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిందని చెప్పవచ్చు. లెహంగాను చేతులతో పట్టుకొని.. స్టేజ్ పైకి అడుగులు వేస్తూ పదహారణాల తెలుగమ్మాయిలా అందరి దృష్టిని ఆకర్షించింది రాశి ఖన్నా. ఇక ఆ ఫోటోలను ఇప్పుడు తాజాగా తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. సింపుల్ స్మైల్ తో తన గ్లామర్ టచ్ తో ఈవెంట్ కే కొత్త అందాన్ని తీసుకొచ్చింది ఈ లేడీ బ్యూటీ.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200